

# స్వాట్ టీమ్‌తో ఉద్రిక్తతలు అదుపు

- 30 మందితో ఏర్పాటు
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక ప్రాంతాలతోపాటు ఇతర ప్రదేశాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఆందోళనకారులు, నిరసనకారులను అదుపు చేయడం, గుంపులను చెదరగొట్టేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సభ్యులతో ఏర్పాటైన స్వాట్ టీమ్‌ను ఉపయోగించనున్నట్టు చెప్పారు. మంగళవారం కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు ప్రధాన కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న స్వాట్ టీమ్‌తో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ, స్వాట్ టీమ్ ప్రత్యేక యూనిఫామ్ ధరించి విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రత్యేక సందర్భాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఈ టీమ్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన హెల్మెట్, లాఠీ, స్టోన్ గార్డు, లాంగ్ రేంజ్, షార్ట్ రేంజ్ షెల్స్, స్మోక్ షెల్స్‌ను, గ్యాస్ గన్ ఫైర్, రైట్ గేర్ ఎక్విప్‌మెంట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు మన్మథరావు, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



స్వాట్ టీమ్‌కు గన్ ఫైరింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

# విప్‌లుగా ఇద్దరు



పి.గణబాబు



చిరంజీవిరావు

ఎమ్మెల్యే పి.గణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు అవకాశం

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇద్దరికి ప్రభుత్వంలో కీలక పదవులు లభించాయి. విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు (గణబాబు), ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావులను 'విప్'లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. వీరిరువురూ పార్టీ సభ్యులను సమన్వయం చేసుకుంటూ శాసనసభ/మండలి సమావేశాలు సజావుగా సాగేలా చూడాల్సి ఉంటుంది. అలాగే ఏదైనా అంశంపై ఓటింగ్ ఉన్నప్పుడు తమకు కేటాయించిన సభ్యులు సభకు వచ్చేలా, కీలకమైన చర్చల్లో పాల్గొనేలా చూడాలి. గణబాబు 2014-2019 మధ్య కూడా విప్‌గా ఉన్నారు. చిరంజీవిరావు 2023 ఉత్తరాంధ్ర పట్టభద్ర నియోజకవర్గం నుంచి శాసన మండలికి ఎన్నికయ్యారు. తమకు విప్‌గా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు గణబాబు, చిరంజీవిరావులు కృతజ్ఞతలు తెలిపారు.

**ఇవీ ప్రయోజనాలు**

విప్‌లకు సహాయ మంత్రి హోదా లభిస్తుంది. ప్రభుత్వం ఎర్ర బుగ్గ లైటుతో అధికారిక వాహనం సమకూరుస్తుంది. అలాగే ... మిగతా 8వ పేజీలో

# పోలీస్ బదిలీల్లో రాజకీయ జోక్యం

## సిఫారసులతో నచ్చిన స్టేషన్‌లో పోస్టింగ్

- అనకాపల్లి రూరల్ స్టేషన్‌కు డబుల్ అటాచ్‌మెంట్
- స్థానిక ప్రజాప్రతినిధి బంధువు సిఫారసుతో విశాఖ కమిషనరేట్ నుంచి ఒక ఎస్‌ఐ బదిలీ
- ఆలస్యంగా రిలీవ్ చేసిన సీపీ
- ఈలోగా మరో ఎస్‌ఐకి బదిలీ అటాచ్‌మెంట్ ఆర్డర్
- ఇద్దరు ఎస్‌ఐలతో దిక్కుతోచని స్థితిలో సిబ్బంది



అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**పోలీసు శాఖలో బదిలీల వ్యవహారంలో రాజకీయ జోక్యం నానాటికీ పెరిగిపోతున్నది. కొంతమంది పోలీసు అధికారులు, సిబ్బంది రాజకీయ పలుకుబడితో కావాల్సిన చోట పోస్టింగులు తెచ్చుకుంటున్నారు. దీంతో ఎటువంటి పలుకుబడి లేని కొందరు సీనియర్ అధికారులు సరైన పోస్టింగులు లేక అప్రధాన్య పోస్టులకే పరిమితం అవుతున్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో జరిగిన 'అటాచ్‌మెంట్ ఆర్డర్' వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.**

బదిలీల ప్రక్రియ ముగిసిన తరువాత కూడా కొందరు ఎస్‌ఐలు తమకు కావాల్సిన స్టేషన్‌లో పోస్టింగులు వేయించుకుంటున్నారు. వాస్తవానికి అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌కు స్థానిక ప్రజాప్రతినిధి బంధువు సిఫారసుతో నెలన్నర కిందట సాధారణ బదిలీల్లో విశాఖపట్నం సిటీ పోలీసు సీఐడీ నుంచి ఒక ఎస్‌ఐని అటాచ్‌చేస్తూ ఆర్డర్ ఇచ్చి నియమించారు. అయితే ఆయనను అక్కడ అధికారులు రిలీవ్ చేయకపోవడంతో ఇక్కడ విధుల్లో చేరలేదు. ఇంతలో అనకాపల్లి పట్టణంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న మరొక ఎస్‌ఐ తనకున్న పలుకుబడితో అనకాపల్లి రూరల్ స్టేషన్‌కు అటాచ్‌మెంట్ ఉత్తర్వులు వేయించుకోగలిగారు. వాస్తవానికి ఆయనను అనకాపల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. కానీ రూరల్ స్టేషన్‌లో నెలన్నరగా విధులు నిర్వహిస్తున్నారు.

ఇదిలా ఉండగా తొలుత స్థానిక ప్రజాప్రతినిధి బంధువు సిఫారసుతో అటాచ్‌మెట్ ఆర్డర్ పొందిన ఎస్‌ఐ రెండు రోజుల కిందట రూరల్ పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. రూరల్ స్టేషన్‌లో ... మిగతా 8వ పేజీలో

# వెలుగులో కుంభకోణం

## డ్వాక్రా సంఘాల సొమ్ము స్వాహా చేసిన వీవోఏ

- సభ్యులకు తెలియకుండానే బ్యాంకు నుంచి రుణాలు
- మరికొన్ని సంఘాల రుణ వాయిదాల డబ్బులు పక్కదారి
- రూ.40 లక్షలకుపైగా మింగేసినట్టు ఆరోపణలు
- అధికారులకు ఫిర్యాదు చేసిన బాధిత మహిళలు



గోవాడ స్టేట్ బ్యాంకు వద్దకు వచ్చిన డ్వాక్రా మహిళలు

చోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

**డ్వాక్రా సంఘాలకు మంజూరైన రుణాలను వారికి తెలియకుండానే బ్యాంకు నుంచి డ్రా చేశారు. మరోవైపు ఇతర సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించి వాయిదాల చెల్లింపునకు సభ్యుల నుంచి నెల నెలా వసూలు చేసిన సొమ్ములను బ్యాంకుకు జమ చేయకుండా స్వాహాచేశారు. దాదాపు రూ.40 లక్షల మింగేసిన వెలుగు వీవోఏ (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్) వ్యవహారం స్థానికంగా కలకలం రేపింది. బాధిత మహిళలంతా వ్యవసాయ కూలీ కుటుంబాలకు చెందిన వారు కావడం, అక్షరజ్ఞానం లేనివారు కావడంతో వీవోఏ మోసగించినట్టు సమాచారం. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడడంతో మండలంలోని సింహాద్రిపురం పంచాయతీకి చెందిన పలువురు మహిళలు మంగళవారం వీవోఏను పట్టుకుని నిలదీశారు. అనంతరం వెలుగు అధికారులను, పోలీసులను ఆశ్రయించారు. ఇందుకు సంబంధించి బాధిత డ్వాక్రా సభ్యులు చెప్పిన వివరాలిలా వున్నాయి.**

చోడవరం మండలం సింహాద్రిపురం పంచాయతీ పరిధిలోని శివారు పాతిక గ్రామానికి చెందిన రెండు డ్వాక్రా గ్రూపులకు ఇటీవల రూ.15 లక్షల రుణం మంజూరైంది. దీనికి సంబంధించిన డబ్బులు గోవాడ స్టేట్ బ్యాంకులో ఆయా గ్రూపుల మహిళల ఖాతాల్లో జమ అయ్యాయి. అయితే స్థానిక వీవోఏఈ విషయాన్ని డ్వాక్రా సభ్యులకు తెలియపరచకుండా, వారి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసి సొంతానికి వాడుకున్నది. అసలు రుణం మంజూరైన విషయం కూడా సదరు డ్వాక్రా సంఘాల సభ్యులకు తెలియజేయలేదు. మరోవైపు ఇదే పంచాయతీలో మరికొన్ని డ్వాక్రా గ్రూపులు గతంలో మంజూరైన రుణాలకు సంబంధించి ప్రతినెలా చెల్లించే వాయిదాల సొమ్ములను బ్యాంకులో జమచేయకుండా స్వాహా చేసినట్టు ... మిగతా 8వ పేజీలో

### రూ.20 లక్షలకు లెక్కలు తేలడంలేదు



మా గ్రూపునకు గతంలో నాలుగు లక్షల రూపాయల రుణం మంజూరైంది. దీనికి సంబంధించి ప్రతి నెలా వాయిదాలు చెల్లిస్తున్నాం. ఇప్పటి వరకు 2 లక్షల 80 వేల రూపాయల మేర బాకీ తీర్చేశాం. బ్యాంకుకు వెళ్లి వాకబు చేస్తే 80 వేల రూపాయలు మాత్రమే కట్టినట్టు ఉంది. మిగిలిన రెండు లక్షల రూపాయల గురించి వీవోఏను అడిగితే సమాధానం చెప్పడంలేదు. మా గ్రామంలో ఐదు గ్రూపులకు సంబంధించి సుమారు 20 లక్షల రూపాయల మేర లెక్కలు తేలడం లేదు.

ముసోడ గంగమ్మ, సింహాద్రిపురం


# వారధి కలేనా?

## పందూరు వద్ద వరహా నదిపై అసంపూర్తిగా వంతెన

- పుష్కరకాలంగా మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- గత టీడీపీ హయాంలో పిల్లర్ల వరకు నిర్మాణం
- తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ
- ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా కదలని వైనం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- శ్లాబ్, ఇతర పనుల కోసం రూ.5.75 కోట్లు మంజూరయ్యాయని అధికారులు వెల్లడి



భారీ వర్షాలు కురిసినప్పుడు పందూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా నది



గత టీడీపీ హయాంలో జరిగిన వంతెన పనులు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క అడుగు కూడా ముందుకు కదలేదు

కోటవురట్ల, నవంబరు 12:


మండలంలో పందూరు వద్ద వరహా నదిపై వంతెన నిర్మాణం ఎప్పటికి సాకారం అవుతుందోనని మూడు గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. నదిలో నీటి ప్రవాహం అధికంగా వుంటే ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. వివిధ పనుల నిమిత్తం మండల, డివిజన్ కేంద్రాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పనుల కోసం నదిని దాటే ప్రయత్నంలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి గతంలో టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పిల్లర్ల వరకు నిర్మించింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు గాలికొదిలేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

సుమారు 12 ఏళ్ల క్రితం వరహా నదికి వరద పోటెత్తడంతో పందూరు వద్ద వంతెన కొట్టుకుపోయింది. దీంతో పందూరు, బంధ, ములగలలోవ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నదిలో వరద తగ్గుముఖం పట్టేవరకు వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ కొత్త వంతెన నిర్మాణం కోసం రాష్ట్ర విభజనకు ముందు 2013లో రూ.6 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయిన తరువాత 2014 ఏప్రిల్‌లో కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ జరిగింది. 2015 మార్చి 5న అప్పటి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2017 డిసెంబరునాటికి శ్లాబ్ మినహా మిగిలిన పనులు పూర్తయ్యాయి. నిధులు మంజూరు అయ్యేనాటికి వున్న ధరలతోపోలిస్తే నిర్మాణ సామగ్రి ధరలు బాగా పెరగడంతో ప్రభుత్వం కేటాయించిన రూ.6 కోట్లతో ఇంతవరకే పనులు అయ్యాయంటూ కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అధికారులు మళ్లీ అంచనాలు తయారు చేసి రూ.3 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు. కాంట్రాక్టు గడువు 2018 అక్టోబరుతో ముగిసింది. మరో ఆరు నెలల్లో జరిగిన ఎన్నికల ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ అధికారంలోకి ... మిగతా 8వ పేజీలో

# ఫణిగిరి ప్రదక్షిణ

## పంచదార్ల పుణ్యక్షేత్రంలో తొలిసారి నిర్వహణ

- కార్తీక పౌర్ణమి రోజున 24 కిలోమీటర్ల మేర భక్తులు ప్రదక్షిణ
- మూడు మండలాల్లో 18 గ్రామాల మీదుగా సాగనున్న పాదయాత్ర



ఫణిగిరిపై ఉమాధర్మలింగేశ్వరస్వామివారి ఆలయం

రాంబిల్లి, నంబరు 12 (ఆంధ్రజ్యోతి):

**కార్తీక పౌర్ణమి రోజున ఉమాధర్మలింగేశ్వరస్వామి కొలువుదీరిన పంచదార్ల ఫణిగిరి ప్రదక్షిణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 15వ తేదీన మూడు మండలాల పరిధిలో సుమారు 24 కిలోమీటర్లు సాగే గిరి ప్రదక్షిణ కారక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని దేవదాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.**

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో పంచదార్ల పుణ్యక్షేత్రం ఒకటి. కొండ దిగువన వున్న రాధామాధవస్వామి ఆలయ గర్భం నుంచి నిరంతరం ఐదు ధారలుగా నీరు ప్రవహిస్తుండడంతో దీనిని 'పంచదార్ల' క్షేత్రంగా పిలుస్తుంటారు. భక్తులు ఇక్కడ (పంచ ధారలు) పుణ్య స్నానమాచరించి, ఫణిగిరిపై కొలువుదీరిన ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేస్తుంటారు. పంచదార్ల క్షేత్రానికి మూడువైపులా ఎత్తైన కొండలు వున్నాయి. అరుణాచలం, సింహాచలం మాదిరిగా ఇక్కడ కూడా గిరి ప్రదక్షిణ చేపట్టాలని దేవదాయ శాఖ అధికారులు భావించారు. మిగిలిన నెలలతో పోలిస్తే కార్తీక మాసంలో పంచదార్ల క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దీంతో కార్తీక పౌర్ణమి నాడు గిరి ప్రదక్షిణ చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



గిరి ప్రదక్షిణ రూట్ మ్యాప్

**గిరిప్రదక్షిణ సాగేదిలా...**

పంచదార్ల పుణ్య క్షేత్రం చుట్టూ 24 కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణం చేయాల్సి ఉంటుంది. పంచదార్ల నుంచి బయలుదేరి ధారపాలెం, ధారభోగాపురం, వెంకటాపురం జంక్షన్, గొర్లెదర్మవరం, వెదురువాడ, అచ్యుతాపురం, చోడపల్లి, కొండకర్ల, యర్రవరం, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, చెర్లోపాలెం, మడకపాలెం, మూలజంప, గోకివాడ, కొత్తూరు మీదుగా తిరిగి పంచదార్లకు చేరుకుంటుంది.

**భక్తులు పాటించాల్సిన నియమాలు**

గిరి ప్రదక్షిణ పారంభించే ముందు భక్తులు రాగి లేదా మట్టి పాత్రలో ఆలయం వద్ద ప్రవహిస్తున్న పంచదార్ల నుంచి జలాలను సేకరించి, అందులో తులసి లేదా మారేడు పత్రం వేయాలి. గిరి ప్రదక్షిణ పూర్తయిన తరువాత ఆలయ ప్రాంగణంలో వున్న ఏ శివలింగం మీద అయిన నీటిని అభిషేకించి తీర్థంగా స్వీకరించాలి.

# మాస్టారి ఇల్లే మ్యూజియం

## ఉపాధ్యాయుని ఇంట పురాతన కళాఖండాలు

- ఇత్తడి, రాగి, తగరంతో చేసిన అరుదైన వంటపాత్రలు,
- పలు రకాల వస్తువులు
- గ్రామఫోన్, పాటల రికార్డులు, టెలిఫోన్లు, కిరోసిన్ లాంతర్లు
- మ్యూజియం ఏర్పాటే లక్ష్యమంటున్న మాస్టారు
- తాజాగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక

... ప్రత్యేక కథనం 8వ పేజీలో

# ఎన్టీఆర్ ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు

- పలు విభాగాలు పరిశీలన
- రోగులకు వైద్య సేవలపై ఆరా



ఎన్టీఆర్ ఆస్పత్రి గైనిక్ వార్డులో గర్భిణితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. గర్భిణులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. ఇటీవల నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన సీటీస్కాన్‌ను పరిశీలించారు. వైద్య పరీక్షల గురించి టెక్నీషియన్‌లను ప్రశ్నించారు. నిర్మాణంలో వున్న క్రిటికల్ కేర్ బ్లాక్ పనులను పరిశీలించారు. వైద్యాలయానికి ఆనుకుని ఉన్న యల్లయ్య కాలువను పరిశీలించి, ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ వైద్యశాలలో మందుల కొరత లేకుండా చూస్తున్నామన్నారు. ఆక్సిజన్ ప్లాంట్ మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. త్వరలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు అందుతున్న సేవలు బాగున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె వెంట డీఎంహెచ్ఓ బాలాజీ, వైద్యులు, ఉన్నారు. కాగా వైద్యాలయంలో . కంటి విభాగం స్పెషలిస్టు రమణకుమార్‌తో నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# గుణుపూర్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ, గుణుపూర్ సెక్షన్‌లో పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-గుణుపూర్ మధ్య నడిచే 08522, 08521 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 13, 16, 17, 20, 23, 24 తేదీల్లో రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. రూర్కెలా-గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ (18117) ఈ నెల 12, 15, 16, 19, 22, 23 తేదీల్లో రూర్కెలా నుంచి పలాస వరకు, తిరుగు ప్రయాణంలో 18118 నంబర్లు గల రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17, 20, 23, 24 తేదీల్లో పలాస నుంచి బయలుదేరి రూర్కెల్ చేరేలా గమ్యాలను కుదించామని పేర్కొన్నారు.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు



విజయవాడలోని కనకదుర్గకు పూజలు ఆచరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గ అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు ఆచరించి, తమ మొక్కులను తీర్చుకున్నారు.

## సర్టిఫికెట్లు ఇప్పించండి

▸▸ ఎంపీడీవో కార్యాలయంలో బాధితురాలు ఫిర్యాదు



ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

పాయకరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తనను నమ్మించి మోసం చేసిన మండలంలో వెంకటనగరం సచివాలయ ఉద్యోగి నుంచి సర్టిఫికెట్లు ఇప్పించాలని గ్రామానికి చెందిన పెనుమత్స అప్పలనరసమ్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు వినతిపత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కుమార్తె చదువు నిమిత్తం ఈడబ్ల్యూఎస్, కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం ఈనెల 6న గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేశానన్నారు. ఈనెల 8వ తేదీన మంజూరైన సర్టిఫికెట్లను సచివాలయంలో తీసుకోవాలని మెసేజ్ రావడంతో గ్రామ సచివాలయానికి వెళ్లామన్నారు. ఆ సమయంలో సచివాలయంలో ఉన్న అగ్రికల్చరల్ అసిస్టెంట్ గోపికృష్ణ ఇంటర్నెట్ పనిచేయడం లేదని చెప్పి దరఖాస్తు ఐడీ తీసుకుని 11వ తేదీన రమ్మని చెప్పాడన్నారు. అయితే 8వ తేదీ సాయంత్రమే అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఫోన్ చేసి సర్టిఫికెట్ల కోసం డబ్బులు డిమాండ్ చేశాడని వాపోయారు. దీనిపై అధికారులు పూర్తి విచారణ చేసి తనకు సర్టిఫికెట్లు ఇప్పించాలని, డబ్బులు డిమాండ్ చేసిన సచివాలయ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## 'మత్తులో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు'



మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్

కోటవురట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల మత్తులో పడి బంగారు భవిషత్తును నాశనం చేసుకోవద్దని కోటవురట్ల ఎస్ఐ రమేష్ కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగం, రవాణా చేయడం, సహకరించడం వల్ల జరిగే నష్టాన్ని వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పట్ల క్రమశిక్షణతో ఉండి, వారిని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలి



మంగవరం పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలతో వైద్యులు ప్రభావతి, స్వరాజ్యం

పాయకరావుపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని మంగవరం పీహెచ్‌సీ వైద్యులు ప్రభావతి, స్వరాజ్యం అన్నారు. మంగవరం పీహెచ్‌సీలో మంగళవారం ఆశ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణలో వారు మాట్లాడుతూ.. సాధారణ వ్యాధులతోపాటు మధుమేహం వ్యాధిపై అందించాల్సిన వైద్య సేవలపై ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రాము, ఎంపీహెచ్ఎస్ కె. శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీల్లో ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి : టీడీపీ



తహసీల్దారుతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లోని జగనన్న ఇళ్ల కాలనీల్లోని ఖాళీ స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకుని, అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరుచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన తహసీల్దారు సత్యనారాయణను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో నామవరం, పెంటకోట తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరుచేయగా.. మిగిలిన స్థలాలను కొంతమంది వ్యక్తులు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు, విక్రయాలు జరుపుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకుని, అర్హులైన పేదలకు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిక్కాల శ్రీనివాసరావు, కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలు ఆక్రమణ

▸▸ డ్రైనేజీలపై సరుకులను నిల్వ చేస్తున్న వ్యాపారులు

▸▸ పూడికతీతకు పారిశుధ్య సిబ్బంది తిప్పలు

▸▸ చిరు వ్యాపారులపై అధికారుల ప్రతాపం

▸▸ పెద్ద వ్యాపారులపై చర్యలు తీసుకోని మునిసిపల్ అధికారులు



ఎలమంచిలి కోర్టుపేట ప్రధాన రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీని ఆక్రమించి ఇనుప ఊచలు నిల్వ చేసిన వ్యాపారి

ఎలమంచిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన రహదారుల కిరుపక్కలా ఉన్న డ్రైనేజీలను వ్యాపారులు ఆక్రమిస్తున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లు, డ్రైనేజీలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో పట్టణ ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కొన్నిచోట్ల డ్రైనేజీల్లో పూడిక తీసేందుకు పురపాలక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీలపై సిమెంట్ పలకులు వేసి ఇనుము నిల్వ చేస్తున్నారు. మునిసిపల్ ప్రజారోగ్య శాఖ కానీ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. పట్టణంలో కొందరు వ్యాపారులు ప్రజాప్రతినిధులకు అనుచరులు కావడంతో మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిరువ్యాపారులపై తమ ప్రతాపం చూపే అధికారులు బడా వ్యాపారులు రోడ్లు, డ్రైనేజీలు ఆక్రమించేసినా కిమ్మనడం లేదని వారంటున్నారు. ఎలమంచిలి పట్టణంలో కోర్టుపేట, జలాలు వీధి, ప్రధాన రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, భవనం వీధి, దిమిలి రోడ్డు జంక్షన్, సైతారుపేట రోడ్డు జంక్షన్, మునిసిపల్ కార్యాలయానికి సమీపంలోనే డ్రైనేజీలను ఆక్రమించేశారు. రోడ్లను, డ్రైనేజీలను ఆక్రమించేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ప్రధానంగా డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేసేందుకు పారిశుధ్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు రోడ్లు, డ్రైనేజీలను ఆక్రమించేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# అల్పపీడనంతో రైతుల్లో ఆందోళన



కోటవురట్ల పాతరోడ్డు వద్ద ఆశాజనకంగా పండిన వరి పంట

కోటవురట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరి పంట దాదాపు చేతికి వచ్చిందని అనుకుంటున్న తరుణంలో అల్పపీడనం హెచ్చరికలతో మండల రైతాంగం ఆందోళన చెందుతోంది. పంట మంచి దిగుబడి వస్తుందని ఆశ పడుతున్న సమయంలో అల్పపీడనం ప్రకటన రైతులను బెంబేలెత్తిస్తోంది. మంగళవారం ఉదయం నుంచి చల్లటి గాలులతో ఆకాశం మేఘావృతమై ఉండడంతో రైతులు గుండెల్లో అల్పపీడనం అలజడి మొదలైంది. చేతికి వచ్చిన పంటను కాపాడుకోవాలని రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. వర్షాలు కురిస్తే పండిన పంట ఎక్కడ నేలపాలవుతుందోనని రైతులు భయపడుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు తుపాను ప్రమాదముందని వాతావరణశాఖాధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో రైతుల్లో ఈ ఆందోళన మరింత పెరిగింది.

## అచ్యుతాపురానికి ఫ్లైఓవర్ వద్దు.. ఔటర్ రింగురోడ్డే ముద్దు

▸▸ ప్రగడ నాగేశ్వరరావుకు విన్నవించుకున్న ఇంటి యజమానుల సంఘం ప్రతినిధులు



రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావుకు సమస్యలను విన్నవించుకుంటున్న ఇంటి యజమానుల సంఘం పతినిధులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సెజ్ కంపెనీలకు వాహనాలు వెళ్లడానికి ఫ్లైఓవర్ కాకుండా ప్రత్యేకంగా ఔటర్ రింగురోడ్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుకు అచ్యుతాపురం మెయిన్‌రోడ్డు ఇంటి యజమానుల సంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం ఆయన నివాసం వద్ద కలిసిన వారు ఔటర్ రింగురోడ్డు ఆవశ్యకతను వివరించారు. వందకు పైగా కంపెనీలు ఉన్న అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో భారీ వాహనాలు, ఫార్మా, కోల్, రసాయన ట్యాంకర్లు నిత్యం ఈ మార్గం గుండా వెళ్లడం వల్ల కాలుష్యం అధికమైందన్నారు. కంపెనీలకు వెళ్లే వాహనాలు అచ్యుతాపురం జంక్షన్లోకి ప్రవేశించకుండా ఔటర్ రింగు రోడ్డును ఏర్పాటు చేసి వాటిని మళ్లించడం ద్వారా, ట్రాఫిక్, కాలుష్య సమస్యల నుంచి పట్టణాన్ని కాపాడుగలుగుతామన్నారు. ప్రభుత్వం తలపెట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రతిపాదన వల్ల అచ్యుతాపురం రూపును కోల్పోనుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన నాగేశ్వరరావు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకు వెళ్లి, ఫ్లైఓవర్ బ్రిడ్జి కాకుండా ఔటర్ రింగురోడ్డు ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేశంశెట్టి అప్పలనాయుడు, పల్లి శేషగిరిరావు, రెడ్డి వెంకటరావు, రెడ్డి సంధ్య, శరగడం దేవి, వి.గుప్త కుమార్, పొన్నమళ్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో ఏకాదశి పూజలు



నక్కపల్లి: ఉపమాకలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఎస్.రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కొండపై వున్న స్వామివారి మూలవిరాట్‌కు, కింద ఆలయంలో వున్న ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి అర్చకులు పూజలు చేశారు. కింద ఆలయంలో వున్న క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం క్షీరాబ్దిద్వాదశి వేడుకలు స్వామివారి పుష్కరిణి వద్ద ఘనంగా జరుగుతాయని ఆలయ అర్చకులు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరంలో..**

కార్తీకమాస ఏకాదశి కావడంతో మంగళవారం మండలంలోని శివాలయాలు, వేణుగోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. దార్లపూడి, ఎస్.రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు గెడ్డపాలెం, సర్వసిద్ధి, పెదగుమ్ములూరు శివాలయాలకు భక్తుల తాకిడి నెలకొంది. ఎస్.రాయవరం బుర్వేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా ఏకాహం భజనలు చేశారు.



అచ్యుతాపురం రూరల్: జగ్గన్నపేట రామాలయంలో భజన చేస్తున్న భక్తులు

**అచ్యుతాపురం రూరల్‌లో..**

మండలంలోని జగ్గన్నపేట రామాలయంలో ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి బుధవారం ఆరు గంటల వరకూ రామనామం జపిస్తూ భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఎలమంచిలి సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ, మండల సహ కన్వీనర్ ఆడారి త్రినాథ్, గ్రామ సర్పంచ్ దొడ్డి కృష్ణ, ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**కోటవురట్లలో..**

కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైలాసపట్నం రాజగోపాలస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

# అపరాలు, చిరుధాన్యాలను పండించాలి : ఏవో



రాంబిల్లి: కొత్తూరులో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ సుమంత



పాయకరావుపేటరూరల్: పెదరాంభద్రపురంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో

రాంబిల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అపరాలు, చిరుధాన్యాలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపాలని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత అన్నారు. మంగళవారం మండలంలోని కట్టుబోలు, కొత్తూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆమె రైతులతో కలిసి ఆయా గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. రబీలో రైతులకు అవసరమైన వరి విత్తనాలను సిద్ధం చేస్తునట్టు తెలిపారు. ఎన్ఎల్ఆర్ 344449-నెల్లూరు సన్నాలు వరి విత్తనాలు మురకాడ, కొప్పుగొండుపాలెం రైతుసేవా కేంద్రాల్లో త్వరలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కొత్తూరు మాజీ సర్పంచ్ ఎన్.సాయివరప్రసాద్, ఏఈఓ సంతోషి, వీపీఏ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరంలో..**

మండలంలోని దార్లపూడిలో మంగళవారం మండల వ్యవసాయాధికారిణి సౌజన్య పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట బీమా నమోదు గురించి రైతులకు అవగాహన కల్పించారు.. జీడిమామిడి పంట బీమా నమోదు గడువు ఈనెల 15 ఆఖరి తేదీ అని, సంబంధిత రైతులందరూ ముందుగా బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలిశెట్టి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

**పాయకరావుపేట రూరల్‌లో..**

వరిలో సుడి దోమ నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తూటికాడ కషాయం పిచికారీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం, గుంటపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు వరిలో పొట్ట, కంకి దశలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాలు, సమగ్ర సస్యరక్షణ గురించి వివరించారు.

## ప్రగడకు సముచిత స్థానం

▸▸ జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నారాయణమ్మ



ప్రగడను కలిసి అభినందనలు తెలుపుతున్న నారాయణమ్మ, నేతలు

ఎలమంచిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రగడ నాగేశ్వరావును నియమించి ముఖ్యమంత్రి చంద్రబాబు సముచిత స్థానం కల్పించారని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాజాన నారాయణమ్మ అన్నారు. మంగళవారం మండలానికి చెందిన పలువురు టీడీపీ నేతలతో కలిసి ఆమె అచ్యుతాపురంలో ప్రగడ నాగేశ్వరరావుని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, త్రినాథ్ పాల్గొన్నారు.

## నేడు రాజయ్యపేటలో డీపీవో విచారణ

నక్కపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ ఈ గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పిక్కి. స్వామి గత కొన్నాళ్ల నుంచి ఆరోపణలు చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. సెక్రటరీ ఇంటి పన్నులు వాడేశారని, ఆర్థిక సంఘం నిధులతో సహా అనేక నిధులను స్వాహా చేశారంటూ బహిరంగంగానే పిక్కి. స్వామి ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం డీపీవో రాజయ్యపేట పంచాయతీలో సెక్రటరీపై వచ్చిన అభియోగాల మేరకు సమగ్ర విచారణ జరపనున్నారు. ఈ మేరకు సెక్రటరీ, డీఎల్‌పీవో, ఈవోపీఆర్‌డీ, పిటిషనర్ పిక్కి. స్వామికి కూడా డీపీవో కార్యాలయం నుంచి సమాచారం అందింది.

## వయోజన విద్యపై ఒక్కరోజు శిక్షణ

రాంబిల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వయోజన విద్యపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయమాధవి మాట్లాడుతూ గ్రామాల్లో వయోజనులకు ప్రాథమిక స్థాయి నుంచి విద్యనేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పద్మ, ఈవోపీఆర్డీ రాజు, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు

రాంబిల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం అచ్యుతాపురానికి చెందిన రైజ్ ఆసుపత్రి నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు డాక్టర్ ఆవినాష్, డాక్టర్ హరీష్ 300 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో రైజ్ ఆసుపత్రి ప్రతినిధులు విజయ్, పాపారావు, హరి, స్థానిక ఆధ్యాత్మిక గురువు శెట్టి అప్పారావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రజాపోరును జయప్రదం చేయండి'

అచ్యుతాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. ఈనెల 15న రాష్ట్రవ్యాప్తంగా జరిగే ప్రజాపోరు ఆందోళన జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పలు ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అప్పారావు, నూకునాయుడు, రామకృష్ణ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో గ్రావెల్ అక్రమ రవాణా

అచ్యుతాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పూడిమడక జగనన్న కాలనీ నుంచి సమీపంలో గల కంపెనీకి అక్రమ గ్రావెల్ తరలింపును మంగళవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. జగనన్న కాలనీలో భారీ వాహనాలు, ఎక్స్‌కవేటర్ల సాయంతో భారీగా గోతులు తీసి గ్రావెల్ అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు వారు ఆరోపించారు. సమీపంలో గల కంపెనీకి వెళ్లే రహదారి విస్తరణ పనులకు ఈ గ్రావెల్ విక్రయిస్తున్నట్టు వారు తెలిపారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.


## ప్రకృతి విపత్తులపై అవగాహన



పూడిమడక ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు వంటివి సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని పూడిమడకలో పదో బీఎన్ ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలు, పిడుగులు, గాలులు వంటివి వచ్చినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎలమంచిలి అగ్నిమాపక ఇన్‌స్పెక్టర్ రాంబాబు, తహసీల్దార్ జనార్దన్, వీఆర్ఓ కిరణ్, గ్రామ సర్పంచ్ చేపల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీలో చేపట్టాల్సి అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులను గుర్తించి, అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. పనుల గుర్తింపులో ఎటువంటి అలసత్వానికి తావులేకుండా అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ సీహెచ్‌ఆర్‌కే.వర్మ, అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీల్లో పారిశుధ్యంపై అధికారుల దృష్టి


ఖండేపల్లిలో చెత్తకుప్పలు తీయిస్తున్న అధికారులు

చోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. మండలంలోని పంచాయతీల్లో అధ్వానంగా ఉన్న వైనంపై ఈనెల 2న సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'స్వచ్ఛతే సేవా' కథనంపై అధికారులు స్పందించి, పంచాయతీల్లో పారిశుధ్య పరిస్థితుల మెరుగునకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగానే ఈవోపీఆర్డీ మహేష్, పంచాయతీ కార్యదర్శి మహలక్ష్మినాయుడు, సర్పంచ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఖండేపల్లిలో చెత్త కుప్పలను మంగళవారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు.

### 16న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెగా జాబ్‌మేళా

చోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 16న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ జాబ్‌మేళాను చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలని కోరారు.

### చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు


మోడల్ కాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు జరుగుతున్న దృశ్యం

దేవరాపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా జరుగుతుందని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి గుల్లిపల్లి అర్జునరావు అన్నారు. స్థానిక మోడల్ కాలనీలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సభ్యత్వం తీసుకు వారికి ప్రమాద బీమా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మొల్లి.కృష్ణమూర్తి, సర్పంచ్ పెంటమ్మ, అబద్దం, సింహ పాల్గొన్నారు.

### జాతీయ సెపకాతక్రా పోటీలకు దేవరాపల్లి విద్యార్థి ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థి జస్వంత్‌తో ఉపాధ్యాయులు

దేవరాపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థి టి.జస్వంత్ జాతీయ స్థాయి సెపకాతక్రా పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు పడాల్ దాస్ తెలిపారు. ఈనెల 9,10 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జస్వంత్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. జస్వంత్‌ను వ్యాయామ ఉపాధ్యాయుడు బాబూరావు, కోచ్ విజయకుమార్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దేముళ్లు అభినందించారు.

## నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణోత్సవం


కల్యాణ వేడుకలో కౌన్సిలర్ పద్మావతి, అర్చకులు, భక్తులు

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. మంగళవారం కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీపై ఊరేగించారు. అనంతరం మండపంలో ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి కల్యాణ వేడుక నిర్వహించారు. 2009లో బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో దొంగతనం జరిగిన తర్వాత చోళుల కాలం నాటి పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను సబ్ ట్రెజరీలో భద్రపరిచారు. 15 సంవత్సరాలు తర్వాత మంగళవారం విగ్రహాలను ట్రెజరీ నుంచి తీసుకువచ్చి కల్యాణం నిర్వహించడం విశేషం. స్పీకర్ భార్య చింతకాయల పద్మావతి, వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

## నాగాపురానికి బస్సు సౌకర్యం కల్పించరూ..


ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు, నాయకులు

కృష్ణాదేవిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం సిహెచ్.నాగాపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు, టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు నర్సీపట్నం ఆర్టీసీ డీఎం ధీరజ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాగాపురం గ్రామానికి ఏళ్ల తరబడి తారు రోడ్డు ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు బస్సు వేయడం లేదన్నారు. దీంతో వందలాది మంది విద్యార్థులు కృష్ణాదేవిపేట జిల్లా పరిషత్ హైస్కూల్, కళాశాలలకు వెళ్లడానికి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నర్సీపట్నం-కృష్ణాదేవిపేట వచ్చే ఆర్టీసీ బస్సును నాగాపురానికి ఉదయం, సాయంత్రం సమయాల్లో నడపాలని టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్, వెంకటేశ్వర్లు, గ్రామస్థులు కోరారు.

## నీలంపేటలో పశువైద్య శిబిరం

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలంపేట గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏడీ రాంబాబు, సర్పంచ్ అప్పలనాయుడు, ఉప సర్పంచ్ వెంకునాయుడు ప్రారంభించారు. శిబిరంలో 54 ఎదకురాని పశువులు, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 17 లేగదూడలకు నట్టల నివారణ, 46 మేకలకు, 62 కోళ్లకు సంబంధించిన వివిధ రకాల వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు పి.నరేశ్, రమేశ్, హరిప్రియ, శిరీషా, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

నర్సీపట్నం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో 12 గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి అధికారులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల అవసరాల నిమిత్తం 2025-26 ఏడాదికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళిక సిద్ధం చేయడంపై రీసోర్సుపర్సన్లు, ఎంపీడీవో పద్మజ వివరించారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# టన్నుకు రూ.3,500 ఇవ్వకుంటే చెరకు సరఫరా చేయం

**» గోవాడ అధికారులకు తేల్చి చెప్పిన రైతులు**


రావికమతంలో చెరకును పరిశీలిస్తున్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అధికారులు

రావికమతం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది క్రషింగ్‌కు ముందే టన్ను చెరకుకు రూ.3,500 మద్దతు ధర ప్రకటించి, సరఫరా చేసిన 15 రోజుల్లో రూ.మూడు వేలు పేమెంట్ చేస్తేనే ఫ్యాక్టరీకి చెరకును సరఫరా చేస్తామని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అధికారుకు రైతులు స్పష్టం చేశారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కేన్ ఇన్‌స్పెక్టర్ తమరాన కొండబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఫీల్డ్‌స్టాఫ్ రావికమతం,గర్నికం గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న చెరకు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు ఫ్యాక్టరీకి చెరకును యథావిధిగా సరఫరా చేయాలని కోరారు. ఫ్యాక్టరీ ద్వారా రైతులకు మేలు చేసేందుకు కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. చెరకు సాగులో అధిక పెట్టుబడుల తోపాటు పంట దిగుబడి రాక తీవ్ర నష్టాలకు గురవుతున్నామని, గతేడాది సరఫరా చేసిన చెరకుకే గోవాడ ఫ్యాక్టరీ ఇంకా పేమెంట్లు ఇవ్వలేదని రైతులు అన్నారు. గిట్టుబాటు ధర లేకపోవడం, సాగుకు అధిక పెట్టుబడులు, కూలీల కొరత కారణంగా సాగు విస్తీర్ణాన్ని ఇప్పటికే తగ్గించుకున్నామని రైతులు వేపాడ అప్పారావు, పోతల తాతబాబు, ఆరై వెంకునాయుడు, చెంచునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. చెరకు సాగు కంటే సరుగుడు సాగే మేలని రైతులు అధికారులకు తెల్చి చెప్పేశారు.ఈ కార్యక్రమంలో ఫీల్డు స్టాఫ్ పులగాయల సత్యనారాయణ, చిన్ని హరిహరరావు, సాసుబిల్లి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చెట్టుపల్లి విద్యార్థుల సత్తా


పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన హై స్కూల్ విద్యార్థులు

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జగ్గయ్యపేటలో ఎన్టీఆర్, కృష్ణ జిల్లాల అమరావతి పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన పోటీలల్లో వారు పాల్గొని ఎనిమిది బంగారు, 8 సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పదో తరగతి విద్యార్థి ఎ.పూర్వజ (57 కిలోలు) గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించింది. తొమ్మిదో తరగతి చదువుతున్న సిహెచ్.కావ్య (52 కిలోలు) గోల్డ్, సిల్వర్ మెడల్స్, ఎం.మణి (47 కిలోలు) రెండు గోల్డ్ మెడల్స్, ఎం.లక్ష్మీదేవి (47 కిలోలు) రెండు గోల్డ్ మెడల్స్, జె.అంకిత (47 కిలోలు) గోల్డ్, సిల్వర్ మెడల్స్, సిహెచ్.కావ్య (43 కిలోలు) రెండు సిల్వర్ మెడల్స్, కె.మానస (43 కిలోలు) సిల్వర్, బ్రాంజ్ మెడల్స్, ఎస్ భాస్కర్ (59 కిలోలు) సిల్వర్ మెడల్ సాధించారు. ఏడో తరగతి విద్యార్థి ఎం.అమృతవల్లి (69 కిలోలు) గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని పీడీ జి.దేవి తెలిపారు. హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# జాతీయ గ్రామాభియాన్‌తో గిరిజన గ్రామాల అభివృద్ధి

**» జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి నాగశిరీషా**


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి

నాతవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మారుమూల వెనుకబడిన గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ పథకం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి నాగశిరీషా చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో ఈ పథకంపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు మండలాల పరిధిలోని పది గ్రామాల్లో ఈ పథకం అమలు చేయనున్నట్టు చెప్పారు. నాతవరం మండలంలో సరుగుడు గిరిజన గ్రామాన్ని ఎంపిక చేశారన్నారు. ఈ గ్రామంలో గిరిజన అవసరాలను తెలుసుకుని, వాటి కల్పనకు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆమె సూచించారు. తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ మాట్లాడుతూ సరుగుడు పంచాయతీలో రేషన్, ఆధార్ కార్డులు, విద్యుత్ మీటర్లు లేనివారిని గుర్తిస్తే వచ్చే నెల 15వ తేదిన ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉషశ్రీ, టీడీపీ నాయకులు కరక సత్యనారాయణ, నందిపల్లి వెంకటరమణ, ఎన్.విజయ్‌కుమార్, పారుపల్లి కొండబాబు, అపిరెడ్డి మాణిక్యం, అధికారులు పాల్గొన్నారు.

## శివాలయంలో ఏకాదశి పూజలు

రావికమతం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రావికమతం, కొత్తకోట శివాలయాలలోనూ, గుమ్ముడు వీధి రామాలయంలోనూ మంగళవారం మహిళలు ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాచకొండ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దీపాలంకరణ చేశారు. కొత్తకోట గుమ్ముడు వీధి రామాలయంలో 24 గంటలు శివనామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

## గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆందోళన

రావికమతం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు ఎగువన కొండపైన ఉన్న సోంపురం, జీలుగులోవ, పశువుల బంద గిరిజన గ్రామాలకు పీఎం జన్‌ధన్ పథకంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని పీవీటీజీ సంఘ నాయకుడు కొర్ర మహేష్ డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల గిరిజనులు మంగళవారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ కుటుంబాలకు చీకటి పడితే క్రూర జంతువుల భయంతో ఇంటి నుంచి బయటకు రాలేక బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆయా గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.గోవిందరావు, గిరిజన సంఘ నాయకులు సీదర కామేశ్వరరావు, గెమిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలి

కె.కోటపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ అభివృద్ధికి అధికారులు పాటు పడాలని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు ఒక రోజు శిక్షణలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పంచాయతీ నిధులను పారిశుధ్య నిర్వహణకు, స్వీపర్ల వేతనాలకు చెల్లించాలన్నారు. అలాగే గ్రామీణ విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ ఏవో ఎస్. అప్పలరాజు పాల్గొన్నారు.

## 'ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేసే అధికారం రాష్ట్రానికి లేదు'

దేవరాపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై కమిషన్ వేసే అధికారం రాష్ట్రానికి లేదని, వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో ఉమ్మడి ఉపకులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. వర్గీకరణ చేస్తే ఐక్యంగా పోరాడతామన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు మత్స వీర్రాజు, మాలిబాబు, బుజ్జి, కంచిపాటి అప్పారావు, రామారావు, పరశురాం, శ్రీను పాల్గొన్నారు.

## జాతీయ ఆయుష్ మిషన్‌పై అవగాహన

మాడుగుల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం, కింతలి పీహెచ్‌సీల వద్ద మంగళవారం కేజేపురం పీహెచ్‌సీ హోమియో వైద్యాధికారి శ్రీదేవి ఆశా వర్కర్లకు ఆయుష్ మిషన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వైద్యులు ప్రసాద్‌పాత్రుడు, లీలా ప్రసాద్, మాలంనాయుడు, దివ్య, సిబ్బంది మురళీ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

**» నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ**

గొలుగొండ/కృష్ణాదేవిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సూచించారు. గొలుగొండ కస్తూర్బాగాంధీ విద్యాలయం, కృష్ణాదేవిపేట ఉన్నత పాఠశాల, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మంగళవారం సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తమ కుటుంబ సభ్యులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే డ్రగ్స్ సరఫరా చేసేవారి ఆట కట్టిస్తామని, ఇందుకు విద్యార్థులు సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో గొలుగొండ, కృష్ణాదేవిపేట ఎస్ఐలు రామారావు, తారకేశ్వరరావు, కృష్ణాదేవిపేట కళాశాల ప్రిన్సిపాల్ సుధ, ఇన్‌చార్జి హెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

**» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మూర్తి యాదవ్**


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మూర్తియాదవ్

రావికమతం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు తగిన గుర్తింపుతోపాటు భరోసా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మూర్తియాదవ్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని గంజి వారి రామాలయంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికే 70 లక్షల మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారన్నారు. మాడుగుల నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు మందకొడిగా సాగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల్లో పార్టీపై మంచి ఆదరణ ఉందని, ప్రజల వద్దకు వెళ్లి త్వరతగతిన సభ్యత్వ నమోదు చేసి, లక్ష్యాన్ని అధిగమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'కష్టపడి పనిచేసిన వారికి టీడీపీలో గుర్తింపు'

చీడికాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు టీడీపీలో గుర్తింపు ఉంటుందని టీడీపీ రాష్ట్ర నాయకుడు కురచా నర్సింహనాయుడు(కవి) అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తగిన పదవులు ఇచ్చి గౌరవిస్తారన్నారు. టీడీపీ కష్టకాలంలో పనిచేసిన నాయకులు గండి బాబ్జి, బత్తుల తాతయ్యబాబు, పీవీజీ.కుమార్‌లకు కార్పొరేషన్ పదవులు ఇచ్చి న్యాయం చేసినందుకు చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీల్లో అవసరాలు గుర్తించండి

నాతవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని పంచాయతీలకు కావాల్సినర అవరాలను గుర్తించాలని ఈవోపీఆర్డీ మూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల కోసం ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. ముందుగానే వీటిని గుర్తిస్తే ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయవచ్చని ఆయన తెలిపారు.

## సుడిదోమ నివారణకు చర్యలు తీసుకోవాలి

చీడికాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు సోకే సుడిదోమ నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఎచ్చెర్ల కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు శ్రావణి, ఎస్.తేజశ్విని, బీవీ.వరలక్ష్మి, ఎం.స్రవంతి సూచించారు. కొన్నెంపూడి కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఖండివరంలో మంగళవారం వరి పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుడిదోమ సోకినట్టు గుర్తించారు. ఈ దోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.

## కశిమిలో పొలంబడి

గొలుగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కశిమి గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుధారాణి మాట్లాడుతూ వరి పొలంలో గింజకట్టే దశలో నీరు సమృద్ధిగా అందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. చీడపీడలపై మందుల పిచికారీ చేయాలంటే వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రిన్సిపాల్ సహదేవుడుకు అవార్డు ప్రదానం


సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సహదేవుడు

రేలుగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గణిత అధ్యాపకుడు బి.సహదేవుడుకు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అందజేశారు. సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. సహదేవుడు కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన సమయంలో కళాశాలలో ఉత్తమ ఫలితాలు రావడంతో అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనను అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## జాతీయ వాలీబాల్ పోటీలకు చినపాచిల విద్యార్థిని


కుష్మితను అభినందిస్తున్న సర్పంచ్ తదితరులు

రావికమతం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినపాచిల హైస్కూల్‌కు చెందిన బంటు కుష్మిత జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్‌లో భాగంగా విజయనగరంలో ఈనెల 9న జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తరపున చినపాచిల పాఠశాలకు చెందిన కె.పూజిత, బంటు కుష్మిత ఆడారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బంటు కుష్మిత జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయినట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.కన్నంనాయుడు తెలిపారు. ఈమె డిసెంబరులో ఉత్తరప్రదేశ్ వారణాసిలో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలో రాష్ట్రం తరపున ఆడనున్నట్టు చెప్పారు. విద్యార్థిని బంటు కుష్మితను మంగళవారం సర్పంచ్ కోమటి రామలక్ష్మి, శంకరరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ముచ్చర్ల ధనుంజయరావు, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నకళ అభినందించారు.

## పనులు కల్పించాలని ఉపాధి కూలీల నిరసన

దేవరాపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించి, వలసలు నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం దేవరాపల్లిలో కూలీలతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు లేక పలు గ్రామాల్లో కూలీలు వలసలు వెళ్తున్నారని, వలసలు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక శుద్ధ ఏకాదశి వ్రతాలు


ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం ఉత్తరవాహినిలోని సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా భక్తులు సామూహిక వ్రతాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా స్వామివారి వ్రతాలు చేశారు. అలాగే భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్తీక పౌర్ణమి, కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా వ్రతాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు భద్రాచలరామం తెలిపారు.

## తలుపులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


తలుపులమ్మతల్లి ఆలయం వద్ద అన్నసమారాధన

కృష్ణాదేవిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిహెచ్.నాగాపురం పంచాయతీలోని పల్లావూరు స్వయంభూ తలుపులమ్మతల్లి అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొయ్యూరు, గొలుగొండ మండలాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ఆలయ కమిటీ ప్రతినిధులు హోమం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలుతో ఆలయం కళకళలాడింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పల్లా గంగరాజు, స్థల దాత బాలం అర్జునరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక అమలుపై శిక్షణ

రేలుగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక అమలుపై మండల స్థాయి శిక్షణకార్యక్రమాన్ని ఎంపీడీఓ నాగేశ్వరరావు ప్రారంభించారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికల తయారీలో సర్పంచ్‌తోపాటు ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## జీడిమామిడి రైతులకు పంటల బీమా వరం

**» జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు**


మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు

చోడవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): జీడిమామిడి సాగు చేసే రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు కోరారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పంటల బీమా పథకం గురించి వివరిస్తూ జీడిమామిడి సాగు చేసే రైతులు పంటల బీమా పథకం కింద ప్రీమియం చెల్లించేలా చూడాలని కోరారు. ఈ పథకం కింద ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15 వరకు గడువు ఉందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రనాథ్, ఉద్యాన శాఖ అధికారిణి భానుపుష్ప లీలావతి, బీమా కంపెనీ కో-ఆర్డినేటర్ వి.వి.గణేశ్, రైతు సేవాకేంద్రాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

## బీమాపై రైతులకు అవగాహన అవసరం

రావికమతం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడి పంటలకు ప్రభుత్వం అమలు చేస్తున్న వాతావరణ ఆధారిత స్వచ్ఛంద బీమా పథకంపై రైతులకు వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానవన అధికారి ప్రభాకరరావు అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఎంపీఈఓలు, ఏఈఓలు, ఉద్యానవన సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంతో జీడిమామిడి రైతులకు కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. 2024-05 రబీలో జీడిమామిడి పంటకు నష్టం వాటిల్లితే ఈ బీమా ద్వారా రైతులకు నష్టపరిహారంగా ఎకరానికి రూ.30,800 అందుతుందన్నారు. రైతులు ఎకరానికి రూ.1,540 ఈనెల 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన హెచ్ఓ భాను పుష్ప లీలావతి, మండల వ్యవసాయాధికారిణి రూప పాల్గొన్నారు.

# తప్పుకోవాలంటే తిప్పలే..!

» సప్పర్ల, ధారకొండ ఘాట్ రోడ్డులో అవస్థలు

» ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదమే..

సీలేరు, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి నుంచి సీలేరు వెళ్లే ఘాట్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నాయి. గత సెప్టెంబరు 8 వతేదీన ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు గూడెంకొత్తవీధి నుంచి సీలేరు వరకు పలుచోట్ల కొండచరియలు, చెట్లు విరిగి పడిపోవడంతో ఈ రహదారి చాలామేరకు దెబ్బతింది. అలాగే, రహదారికి ఉండే రక్షణ గోడతోపాటు రోడ్డు అంచులన్నీ వరద నీటి ఉధృతికి కోతకు గురయ్యాయి. దీంతో సప్పర్ల, ధారకొండ , సీలేరు ఘాట్ రోడ్డులో బస్సులు రోడ్డు అంచుల కిందకు దిగితే రోడ్డు కుంగిపోయి బస్సులు లోయలోకి జారిపోయే ప్రమాదం ఉంది. వర్షాలకు జారిపడిన కొండ చరియలపై ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలిక చర్యలు మాత్రమే చేపట్టారు. ఈ అంతర్రాష్ట్ర రహదారి గూడెం నుంచి సీలేరు వరకు సింగిల్ లైన్‌తో ఉంది. ఇది కూడా వర్షాల ప్రభావంతో బాగా దెబ్బతినడంతో బస్సులు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రెండు బస్సులు ఎదురెదుగా వచ్చినప్పుడు అవి పక్కకుతప్పుకోవాలంటే చాలా దూరం వెనక్కి వెళితే తప్పా వీలుకాని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ ఘాట్ రోడ్డులో ప్రయాణంలో తీవ్ర జాప్యంతో పాటు, పెను ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. సీలేరు, ధారకొండ, సప్పర్ల, జీకేవీధి తదితర ప్రాంతాల్లో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధులకు వెళ్లలన్నా, అత్యవసరంగా రోగులకు చికిత్స కోసం, గర్భిణులను ఆసుపత్రికి తరలించాలని ఈ మార్గమే ప్రధాన ఆధారం. ప్రయాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ స్థితిలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్పందించి ఇరుకుగా ఉన్న రహదారి సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



దారకొండ సప్పర్ల ఘాట్‌లో ఎదురెదురు బస్సుల పరిస్థితి

## సీఆర్‌పీఎఫ్ శ్రమదానం



సీలేరులో రెగ్యులేటర్ డ్యామ్ వద్ద మొక్కలు నాటుతున్న పోలీసులు

సీలేరు, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో సీఆర్‌పీఎఫ్ జీ 42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. స్థానిక డ్యామ్‌కు రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. పచ్చదనం పరిశుభ్రత లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించనట్టు సీఆర్‌పీఎఫ్ జీ 42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వికాష్ పాండే తెలిపారు.

## 'అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వొద్దు'

డుంబ్రిగుడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు తావివ్వకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ అమిత్ బర్దర్ స్పష్టం చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. గంజాయి సాగు గుర్తించి ధ్వంసం చేయాలని స్థానిక ఎస్ఐ కే పాపినాయుడుకు ఆదేశించారు. మత్తుకు బానిసలవుతున్న యువతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## 'పొలం పిలుస్తోంది'



పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

డుంబ్రిగుడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖంద్రుం పంచాయతీ పరిధిలో స్థానిక సర్పంచ్ హరి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి నీలవేణి పొలాల్లో నూతన సాగు విధానంపై గిరి రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ హరి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సూచనలను పాటించి, అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయసిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

**ముంచంగిపుట్టు:** గిరి రైతు లు విధిగా పంట బీమాను చేయించుకోవాలని ఏవో శ్రీనివాస బాబు సూచించారు. మండలంలోనిపెదగూడ, కిం చాయిపుట్టు పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యసాయ, పశు సంవర్థక , ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కాశీపట్నంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

అనంతగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నంలో మంగళవారం అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. షుగర్, బీపీ, హెచ్‌బీ టెస్టులు చేశారు. ఇంటింటికీ వెళ్లి 102 మంది రక్తపూత నమూనాలు సేకరించామన్నారు. జ్వరాలతో బాధపడుతున్న ఐదుగురికి వైద్యసేవలను అందించినట్టు ఆమె తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి డాక్టరేట్

పెదబయలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):మండలానికి చెందిన కొరవంగి ఉపాధ్యాయుడు సలబంగి కోటేశ్వరరావుకు ఢిల్లీ డెస్టినీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా పే బ్యాక్ టు ది సొసైటీ అనే నినాదంతో ఓ వైపు ఉపాధ్యాయ వృత్తి.. మరో వైపు సామాజిక సేవా కార్యక్రమాలు తలపెడుతున్న ఆయనకు ఈ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అక్టోబరులో చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ అంబేద్కర్ సేవా రత్న అవార్డును బహూకరించిందన్నారు.

## దివ్యాంగులకు సేవలందించే సంస్థలకు ప్రోత్సాహం

» కలెక్టర్ దినేశ్ కుమార్



ఉపకరణాల పంపిణీలో కలెక్టర్ దినేశ్‌కుమార్

అరకులోయ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు స్వచ్ఛందంగా సేవలందించే సంస్థలను ప్రోత్సహిస్తామని కలెక్టర్ దినేశ్ కుమార్ అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా సేవలందిస్తున్న ఎబిలిటీ పీపుల్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో అరకుప్రాంతంలో గుర్తించిన దివ్యాంగులకు కలెక్టర్ చేతుల మీదుగా చక్రాల కుర్చీలు, కృత్రిమ ఉపకరణాలు పంపిణీ చేశారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో గ్రామ సచివాలయాలు కేంద్రంగా జిల్లా వ్యాప్తంగా దివ్యాంగుల గుర్తింపు కార్యక్రమం చేపడతామన్నారు. అవసరమైన సదరం ధ్రువపత్రాలు అందిస్తామన్నారు. ఎబిలిటి పీపుల్ సంస్థ దివ్యాగులకు ఉపకరణాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆ సంస్థ డైరెక్టర్లు దిలీప్‌పాత్రో , స్వప్నమాధురీ మాట్లాడుతూ పాడేరులో గతంలో దివ్యాంగులకు శిబిరం నిర్వహించామన్నారు. అప్పట్లో అరకు ప్రాంతానికి చెందిన 22 మందిని గుర్తించిన వారికి ఉపకరణాలు అందించినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దివ్యాంగులకు ఓ పథకం అమలు అమలు చేస్తోందని, ఏడాదికి కేవలం రూ.50 చెల్లిస్తే రూ. లక్ష వరకు వైద్య సేవలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, పె దలబుడు ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనందరావు, ఎంపీడీవో ఎ.లవరాజు, తహసీల్దార్ ఎం.వి.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## జోడూరు ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టాలి

» గిరిజన సంఘం జిల్లా నాయకులు లక్కు, చిట్టిబాబు



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

పాడేరురూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జోడూరు గ్రామంలోని పాఠశాలలో విధులకు హాజరైన ఉపాధ్యాయుడిపై తక్షణమే చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం జిల్లానాయకులు పాలికి లక్కు, ఎస్. చిట్టిబాబు డిమాండ్ చేశారు. గిరిజన సంఘం భవనంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మినుములూరు పంచాయతీ జోడూరు పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని కలెక్టర్‌కు గ్రామస్థులు వినతి పత్రమిచ్చారు. ఈ మేరకు స్పందించిన విద్యాశాఖాధికారులు గత నెల (అక్టోబరు)11న ఒంటిపాకలో పనిచేస్తున్న సూరిబాబు అనే ఉపాధ్యాయుడికి జోడూరుకు డిప్యుటేషన్ వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ ఉపాధ్యాయుడు జోడూరు వెళ్ల లేదు. దీంతో ఈ నెల 8వ తేదీ శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టడంతో స్పందించిన పీవో అభిషేక్ 11వ తేదీ సోమవారం పాఠశాలకు ఉపాధ్యాయుడు హాజరవుతారని హామీ ఇచ్చారు. అయితే, మంగళవారానికి కూడా ఆయన రాలేదన్నారు. ఉపాధ్యాయుడు హాజరుకాక గ్రామంలో 28 చిన్నారులు ప్రాథమిక విద్యకు దూరం అవుతున్నారన్నారు. విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయుడుపై చర్యలు చేపట్టి మరొకరని నియమించాలని, లేకుంటే నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు డి.బుజ్జన్న, వెంకటరమణ పాల్గొన్నారు. ఈవిషయంపై ఎంఈవోను వివరణకోరగా దీనిపై డీఈవో విచారణ చేపడుతున్నారని, ఆయనే చర్యలు తీసుకుంటారన్నారు.

## రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

డుంబ్రిగుడ,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14 నుంచి 21 వరకు 57వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించునట్టు స్థానిక గ్రంథాలయ అధికారి ఎస్. సునీత తెలిపారు. ఈసందర్భంగా వారం రోజుల పాటు రోజువారీగా విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహిస్తామని చెప్పారు. చిన్నారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పక్కన నెహ్రూకేంద్రం అధికారులు



విద్యార్థుల నృత్య ప్రదర్శన

## ఘనంగా యువ ఉత్సవ్-2024

అరకులోయ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్- 2024 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్ కుమార్‌నాయక్ అధ్యక్షత వహించి మాట్లాడారు. యువత అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అలాగే, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ .. యువత దేశ ఐక్యతకోసం పాటుపడాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులైన నెహ్రూ కేంద్రం జిల్లా అధికారి జిమహేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్‌కేవై ద్వారా యువతకు అందిస్తున్నసేవలను వివరించారు. స్థానిక క్రీడాపాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎస్. ఎన్. మూర్తి మాట్లాడుతూ దేశగొప్పతనాన్ని ప్రపంచానికి చాటేది యువతేనన్నారు. ఈ ఉత్సవంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. అరకులోయ కో-ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థులు, మహిళా కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. వివిధ ప్రాంతాలకు చెందిన కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంతో పారదర్శకత

ముంచంగిపుట్టు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఏవో శ్రీనివాసబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి ఈ మేరకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు తరహాలోనేసమాచారహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, సమాజం అభివృద్ధి దిశగా పయనించేందుకు ఈ చట్టం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీసాయిహర్ష, ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న పాల్గొన్నారు.

## రాజకీయ పత్రంలా రాష్ట్ర బడ్జెట్: సీపీఐ

పాడేరురూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాజకీయ పత్రంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమావేశాల్లో ముఖ్యమంత్రిని కీర్తించడం, గత వైసీపీ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని వర్ణించడానికే సమయం సరిపోయిందన్నారు. ఆదివాసీ లకు, దళితులకు, మహిళలకు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. ఎన్నికల హామీలను కనీస ప్రస్తావించకపోవడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందన్నారు. సబ్ ప్లాన్‌గా దళితులకు 6.28 శాతం, గిరిజనులకు 2.56 శాతం మాత్రమే కేటాయించారన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల ప్రస్తావన లేదన్నారు. బాలబాలికలు, బాలింతలకు సేవలు అందిస్తున్నఅంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతనాల పెంపు హామీల ఊసేందన్నారు.

## పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక

కొయ్యూరు, నవంబరు 12: పంచాయతీలకు సమకూరే నిధులు ప్రజోపకర పనులకు వినియోగిస్తే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని ఎంపీడీవో ఎస్‌కేవీ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ బడ్జెట్‌ను ఏ పనులు ఏ మేరకు ఉపయోగించాలి, టైడ్ అన్‌టైడ్ ఏ విధంగా ఖర్చు చేయాలి అన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితోపాటు ఎంఈవో, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎంఐ జేఈలు, ఏటీడబ్ల్యూవో, ఐసీడీఎస్ పీవో, వెలుగు ఏపీఎం, ఉపాధి ఏపీవో తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ అనంతరం సచివాలయ సిబ్బందితో కొయ్యూరు ఎంపీడీవో ప్రసాద్

**చింతపల్లి:** పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, వీవోఏ, కార్యదర్శులతో మండల అభివృద్ధి ప్రణాళిక (బీపీడీజీ), పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇతర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ ప్రణాళిక రూపకల్పనలో ప్రతి ఒకరూ భాగస్వామ్యులు కావాలన్నారు. ఈకార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఎంఈవో ప్రసాద్, హౌసింగ్ ఏసీ రమణ బాబు పాల్గొన్నారు.

**ముంచంగిపుట్టు:** స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 2025-2026 సంవత్సరాలకు గాను గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఏ విధంగా తయారు చేసుకోవాలో అనే అంశాలను ఎంపీడీవో వివరించారు. ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శులు సత్యరంజన్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

### అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలి: ఎంపీడీవో

**అనంతగిరి:** అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో ఏవీవీ కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో ఉపాధిహామీ క్షేత్రస్థాయి సిబ్బందితో మంగళవారం సమావేశమైయ్యారు. ఆర్వోఎఫ్‌ఆర్ సంబంధించి లబ్ధిదారులకు 150 రోజులు ఉపాధి పనిదినాలను కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పవన్, ఏపీవో సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీటితోనే చిన్నారులకు అస్వస్థత

» అల్లూరి జిల్లా గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి బాలదేవ్

అరకులోయ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు, పారిశుధ్య లోపంతో బస్కీ పంచాయతీ జాకరవలస గ్రామంలో 20 మందికి పైగా చిన్నారులు జ్వరం, కళ్లకలక, దగ్గు, దురదలు, వాంతులు తదితర సమస్యలతో అస్వస్థత పాలైనట్టు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దుబాలదేవ్ తెలిపారు. అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ చిన్నారులను మంగళవారం ఆయన పరామర్శించారు. చిన్నారులతోపాటు తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నట్టు వారు వివరించారు. ప్రస్తుతం సోలార్ రక్షిత తాగునీటి పథకం ఉన్నా దానినినుంచి తగినంత నీరు రావడం లేదని ఆరోపించారు. వాటర్ ట్యాంకు శుభ్రపరచడంలేదని వివరించారు. దీంతో గత వారం రోజుల నుంచి చిన్నారులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నట్టు తెలిపారు. మాడగడ పీహెచ్‌సీ వైద్యులు గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారని, మరింత మెరుగైన చికిత్సకు చిన్నారులను అరకు ప్రాంతీయ ఆస్పత్రికి మంగళవారం తరలించినట్టు పేర్కొన్నారు. వ్యాధులు విజృంభణకు గ్రామంలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతోపాటు, పారిశుధ్య పనులు చేపట్టకపోవడమేనని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దుబాలదేవ్ ఈ సందర్భంగా ఆరోపించారు. గ్రామంలో వాటర్ ట్యాంకును శుభ్రం చేయడంతోపాటు పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆయన డిమాండ్ చేశారు. అవసరం మేరకు గ్రామంలో మరోమారు వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్సనందించాలని కోరారు.



అరకు ఆస్పత్రిలో చిన్నారులను పరామర్శిస్తున్న బాలదేవ్

## స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్: ఎస్పీ అమిత్‌బర్దర్



మాట్లాడుతున్న అల్లూరి ఎస్పీ అమిత్‌బర్దర్

అరకులోయ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థలు గిరిజనుల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. మంగళవారం రాత్రి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో స్థానిక పోలీస్ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. అరకులోయ ,అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్ మండలాల పరిధిలో పనిచేస్తున్న నేచర్, నాంది, ట్రైడ్స్ వికాస్, సంజీవిని, వాసన్, థింక్‌పీస్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడారు. గంజాయి సాగు, రవాణా నిరోధానికి కృషి చేయాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. మహిళపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయికి ప్రత్యామ్నాయంగా వాణిజ్యపంటల సాగు చేసేలా గిరిజనులను ప్రోత్సహించాలని సూచించారు. అసాంఘిక నేరాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అరకు సీఐ ఎల్.హిమగిరి, ఎస్ఐ జి. గోపాలరావు, ఆపరేషన్ ఆర్ఐ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం



సమావేశంలో సర్పంచ్ రామకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి అరుణకుమారి

గూడెంకొత్తవీధి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ కాఫీ రైతులకు మ్యాక్స్ జీసీసీల ద్వారా గరిష్ఠ ధరలు అందించనున్నట్టు మండల ఉద్యానశాఖ అధికారి కె. అరుణకుమారి తెలిపారు. మంగళవారం దామనాపల్లి గ్రామ పంచాయతీలో స్థానిక సర్పంచ్ కుందరి రామకృష్ణ అధ్యక్షతన రైతులతో సమాశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ ఏటా మాదిరిగా ఈసారి కూడా గిరిజనులు పండించిన కాఫీకి మ్యాక్స్, జీసీసీ మార్కెటింగ్ సదుపాయం కలిస్తున్నట్టు చెప్పారు. మ్యాక్స్ కిలో కాఫీ పండ్లకు రూ.44 ధర చెల్లించనుందన్నారు. కాఫీ మార్కెటింగ్ అనంతరం బోనస్ చెల్లిస్తుందన్నారు. జీసీసీ పార్చిమెంట్ కిలోకి రూ. 285, చెర్రీ కిలో రూ. 150 ధరలకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు కాఫీ గింజలను దళారులకు విక్రయించవద్దన్నారు. మ్యాక్స్ జీసీసీ ద్వారా అధిక ధర పొందాలన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ జీసీసీ పెట్టుబడి రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

## నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న విద్యాశాఖాధికారి అప్పలరాములు

సీలేరు, నవంబరు 12 , (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నిర్ణీత సమయంలో సిలబస్‌ను పూర్తి చేసి, వారు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె. అప్పలరాములు అధ్యాపకులకు సూచించారు. జీకేవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీని మంగళవారం అప్పలరాములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్, సిబ్బందితో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. కళాశాలకు పక్కా భవనం మంజూరుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయాలని ప్రిన్సిపాల్, సిబ్బంది ఆయనకు విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యాశాఖ అధికారి క్లాస్ రూమ్‌లకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిన్సిపాల్ వి. శంకరరావు, ఎన్ఆర్‌జీఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయను సకాలంలో గుర్తిస్తే నియంత్రణ సాధ్యం

చింతపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్షయను సకాలంలో గుర్తిస్తే వ్యాధి నివారణ సాధ్యమేనని మండల ఎంవో టీసీ డాక్టర్ లక్ష్మీకాంత్ అన్నా రు. మంగళవారం లోతుగెడ్డ పీహెచ్‌సీలో జీకేవీధి, చింతపల్లి ఎంఎల్‌హెచ్‌పీలకు సంక్రమిత రోగాలపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎంవోటీసీ మాట్లాడుతూ ఒకరి నుంచి ఒకరికి సంక్రమించే క్షయ, కుష్ఠు, హెచ్ఐవీపై ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దగ్గు, జ్వరం రెండు వారాలకు మించి ఉంటే కచ్చితంగా కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే, ఆ రోగులు మం దులు వేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పర్శలేని మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు.ఈకార్యక్రమంలోపాడేరు డీపీసీ శేషు, డీపీఎస్ రామరాజు, ఎస్టీఎల్ఎస్ నగేశ్, ఎస్టీఎస్ రహిమాన్, సూపర్‌వైజర్లు వెంకటరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

## దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: సీఐ



వర్తక సంఘం నాయకులతో మాట్లాడుతున్న సీఐ వినోద్ బాబు

చింతపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్తకులు దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానిక సీఐ ఎం. వినోద్ బాబు కోరారు. మంగళవారం వర్తక సంఘం నాయకులతో సీఐ సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటుతో దొంగతనాలు జరిగితే దోషులను సులభంగా పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు వర్తకులు సహకరించాలన్నారు. వారపు సంత రోజు రహదారికి అనుకుని దుకాణాలను ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుందన్నారు. రహదారి ఫుట్‌పాత్‌ని పూర్తిగా విడిచిపెట్టి దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంతల్లో గిరిజనులకు నాణ్యమైన సరకులను విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, నాయకులు దూనబోయిన రమణ, రమణమూర్తి పాల్గొన్నారు.

## రైతులకు అదనపు ఆదాయంతోనే సుస్థిరత : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన వివిధ శాఖ అధికారులు

పాడేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు అదనపు ఆదాయంతోనే వారికి ఆర్థిక సుస్థిరత సాధ్యమవుతుందని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. గిరిజన రైతుల కోసం మంగళవారం ఏర్పాటు చేసిన అమ్మకం, కొనుగోలుదారుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో చేరాలని, అప్పుడే రైతులకు శక్తి పెరుగుతుందన్నారు. సంఘాలుగా చేరితే ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించే అవకాశాలున్నాయన్నారు. వ్యవసాయ రంగంలో సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం లేదనే అపవాదు వస్తున్నదన్నారు. అందు వల్ల రైతు ఉత్పత్తుల విక్రయాల్లో మధ్యవర్తుల ప్రమేయాన్ని అరికట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలున్నాయని, రైతులు ఎఫ్‌వోగా ఏర్పడాలని కలెక్టర్ సూచించారు. చక్కని ప్రణాళికలతో ఎఫ్‌పీవోలు విజయవంతంగా సాగాలన్నారు. ఎఫ్‌పీవోలు మరింతగా ఎదిగేందుకు కృషి చేయాలని, ప్రతి రైతు ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి వివిధ సంస్థలు, సంఘాలు చేపడుతున్న చర్యలకు తాము సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైపర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కట్టా శ్యామ్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, డ్వామా పీడీ శివయ్య, నవ జీవన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సహదేవయ్య, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, కొనుగోలుదారులు, ఎఫ్‌పీవో ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శారదానగర్ రోడ్డుకు మోక్షం

రూ.కోటి మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం

కాలేజీ కూడలి నుంచి చురుగ్గా తారు రోడ్డు నిర్మాణం

వాహన చోదకులు, ప్రయాణికులు, పట్టణ ప్రజల హర్షం

కొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కొత్తూరు కాలేజీ కూడలి నుంచి శారదానగర్ ప్రధాన రోడ్డుకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్ళ నుంచి ఎటువంటి అభివృద్ధికి నోచుకోని ఈ రోడ్డుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కోటి రూపాయలు మంజూరైంది. ఈ నిధులతో రోడ్డు నిర్మాణం చురుగ్గా సాగుతోంది. గతంలో ఈ రోడ్డులో వర్షం నీరు చిన్నపాటిదానికే నిలిచిపోయేది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు రాకపోకల కోసం నరకయాతన అనుభవించేవారు. ప్రసుతం వారికి ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనేందుకు వీలు లేకుండా తారు రోడ్డు నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ అధికారులు పనులను రేయింబవళ్లు చురుగ్గా చేపడుతున్నారు. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.





కొత్తూరు కూడలి నుంచి శారదానగర్ వరకు నిర్మిస్తున్న తారు రోడ్డు... (ఇన్‌సెట్‌లో) రాత్రి సమయంలోనూ జరుగుతున్న పనులు

## శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేమునిగుమ్మం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తికి 108 దీపాలతో హారతి ఇచ్చారు. ఆలయ ఈవో రాజసులోచన, అర్చకులు పి.ప్రసాద్, పి.రాజేష్ బాబులు పూజలు నిర్వహించారు.

## 200 మందికి నేత్ర వైద్య సేవలు

తుమ్మపాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తుమ్మపాలలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తుమ్మపాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 200 మందికి వైద్యులు నిఖిల్, దివ్య, ఝాన్సీ కంటి పరీక్షలు చేశారు. అలాగే 50 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అశ్వినీకుమార్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఈ.సత్యనారాయణ నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, తట్టా పెంటయ్యనాయుడు, పిళ్లా హరశ్రీనివాసరావు, బొడ్డపాటి రాజారావు, మేడిపల్లి గణేష్, పి.కన్నారావు పాల్గొన్నారు.



శూలాలను ధరించిన శివుని మాలధారణ భక్తులు

## ఘనంగా శూలాల పండగ

కశింకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ బంగారయ్యపేట గ్రామంలో సోమవారం రాత్రి సాంబమూర్తి శూలాల పండుగ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శివాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. శివయ్య మాలధారణ భక్తులు శూలాలను ధరించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం శూలాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. దీంతో గ్రామమంతా శివన్నామస్మరణతో మార్మోగిపోయింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శివుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

## సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుంకరమెట్ట వద్ద గల సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్తీక మాసం ఏకాదశి కావడంతో పలువురు దంపతులు ఈ వ్రత పూజలో పాల్గొన్నారు. శుక్రవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, వ్రతాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు విద్యాసాగర్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న చిన్నారుల భరతనాట్యం



భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం పీలా వారీ గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద సోమవారం రాత్రి బుద్ధ గిరిజా స్పందన విద్యార్థులు చేసిన భరతనాట్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్తీక మాసంలో భాగంగా ఆలయం వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి భరతనాట్యాన్ని తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాలకు రాంకీ వంట సామగ్రి వితరణ




వంట పాత్రలు, ఇతర సామగ్రి అందజేస్తున్న రాంకీ, ఫార్మాసిటీ ప్రతినిధులు

పరవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రాంకీ ఫౌండేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా వంట పాత్రలు, కుక్కర్, మిక్సీ, స్టవ్ తదితర సామగ్రిని సమకూర్చింది. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ డీజీఎం గిరిధరభక్షి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్ చేతుల మీదుగా వీటిని పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.అప్పలనాయుడు, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు చుక్క ఉమా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగింపు



ఎక్స్‌కవేటర్ సహాయంతో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పరవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడచీపురుపల్లి పశ్చిమ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 398/15లోని ప్రభుత్వ స్థలంలో గల ఆక్రమణలను తొలగించారు. గ్రామానికి చెందిన మాసవరపు అప్పారావు ఇటీవల తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్‌కు ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీఆర్వో ఆర్.హేమలత పర్యవేక్షణలో ఎక్స్‌కవేటర్ సహాయంతో ప్రభుత్వ స్థలంలో నాటిన మొక్కలను తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. భవిష్యత్తులో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని వీఆర్వో హెచ్చరించారు.

# శారదానగర్‌లో మద్యం దుకాణం వద్దు

కొవ్వొత్తులతో నిరసన గ్రామస్థుల నిరసన ప్రదర్శన



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న శారదానగర్ వాసులు

కొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ శారదానగర్ ప్రాంతంలో మద్యం దుకాణాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శారదానగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు సభ్యులు, శారదానగర్ పరిరక్షణ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ తాత్కాలికం, నాలుగు రోజులంటూ దుకాణం నిర్వాహకులు శాశ్వత ఏర్పాట్లు చేసుకుంటున్నారన్నారు. గతంలోనూ శారదానగర్‌లో ఉద్యమించి మద్యం దుకాణం ఏర్పాటు కాకుండా అడ్డుకున్నామన్నారు. గ్రామ పంచాయతీ కూడా శారదానగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని తీర్మానించిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో పాటు అధికారులందరికీ వినతిపత్రాలు అందజేశామన్నారు. వారు కూడా తమకు సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారుల వద్ద తాత్కాలికమంటూ హామీలు ఇచ్చి కదలడం లేదన్నారు. దుకాణం శారదానగర్ ప్రాంతంలో ఏర్పాటు కాకుండా అందరూ సహకరించాలని కోరారు. దశలవారీగా ఆందోళనను ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# మద్యం బెల్టు దుకాణాలను నివారించాలి

▸▸ సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం



ఇంటింటా ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు దుకాణాలను నివారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కోరారు. సీపీఎం ప్రజాపోరులో భాగంగా పూడిమడక రోడ్డు, రామాలయం వీధి, పెదరెల్లివీధి, శారదా కాలనీల్లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ జిల్లాలో అక్రమంగా మద్యం బెల్టు షాపులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వీటి నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లాలో వీధివీధికీ మద్యం బెల్టుషాపులను పెట్టి అమ్మకాలు సాగిస్తూ తద్వారా కోట్లాది రూపాయలను ప్రజల నుంచి కొల్లుగొడుతున్నారని ఆయన ఆరోపించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు రోజు వారీ వేతనం మద్యానికి ఖర్చు చేయడంతో ఎంతో మంది పేదల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం బెల్టు దుకాణాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా శ్రీరామ్, బి. ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన గ్రామ రెవెన్యూ సదస్సులు

▸▸ 20 సదస్సుల్లో సమస్యలపై 1851 అర్జీలు

▸▸ 15 రోజుల్లో పరిష్కారం: తహసీల్దార్ చిన్నికృష్ణ



నారపాడులో రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

సబ్బవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిశాయని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. చివరి రోజు నారపాడులో జరిగిన గ్రామసభలో తహసీల్దార్ పాల్గొని రైతులు నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రీ సర్వే జరిగిన 20 గ్రామాల్లో సభలు నిర్వహించడం ద్వారా వివిధ సమస్యలపై 1851 అర్జీలు రైతులు నుంచి వచ్చాయని తెలిపారు. గ్రామ సభలు ముగిసిన నాటి నుంచి 15 రోజులులోగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అధికారులు, ఇరు వర్గాలకు చెందిన రైతులతో కలసి క్షేత్ర స్థాయికి ఎళ్లి పరిశీలించడం జరుగుతుందన్నారు. చిన్నచిన్న సమస్యలపైనే అధికంగా అర్జీలు వచ్చాయన్నారు. విస్తీర్ణం తక్కువగా ఉందని 999 అర్జీలు, లేండ్ క్లాసిఫికేషన్ పై 22, పేర్లు సరిదిద్దాలని 135, సర్వే నెంబర్ల పొరపాటుపై 36, వెబ్‌లేండ్ ఎంట్రీ కోసం 434, ఉమ్మడి కుటుంబంలో పంపకాలపై 37, తప్పుడు ఎంట్రీలపై 19, ఫొటోలు తప్పుగా వచ్చాయని 37, డిఎల్ఆర్ ఎంట్రీ పొరపాటుపై 26, ఇతర సమస్యలపై 106 అర్జీలు వచ్చాయన్నారు. విజయవంతంగా సభలు పూర్తి చేసిన సిబ్బంది, సహకరించిన రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ వై.గణేశ్, వీఆర్వో అనంత్, సర్వేయర్లు రాంబాబు, శ్రీనివాసరావు, కార్యదర్శి సూర్యమణి, సర్పంచ్ మామిడి శంకరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మామిడి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు గ్లోబల్ విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏపీయూఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో విద్యార్థులు వి.తేజేస్, వి.శ్యామ్‌కుమార్, పి.తేజస్వరూప్, డి.నిఖిల్, ఆర్.సుప్రతీక్, ఎం.సంపత్, జె.జయదీప్, సాహల్‌గోవింద్, హిమ ప్రభాస్, బి.లాస్య, కె.అతిక్ష నారాయణ, డి.బెర్నికా ప్రజ్ఞ, ఐ.వైష్ణవి పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించినట్టు పాఠశాల కోచ్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, కోచ్ బి.హరినాథరెడ్డి అభినందించారు.

### ఫుట్‌బాల్ పోటీలకు సబ్బవరం విద్యార్థిని..

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సబ్బవరపు రేష్మ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆర్ఐవో, ప్రిన్సిపాల్ వి.మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8, 9, 10 తేదీల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపినట్టు చెప్పారు. ఈ మేరకు మణిపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రేష్మ ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మూర్తి, పీడీ కె.రమణారావు, సిబ్బంది రేష్మను మంగళవారం అభినందించారు.

## అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

పరవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీవో శ్యామ్‌సుందర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ వివరాలను గ్రామ స్వరాజ్ యాప్‌లో వచ్చే ఏడాది జనవరి 31 కల్లా అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణ అధికారి కె.ధర్మారావు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

పరవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశపాత్రునిపాలెంలో జీవీఎంసీ 79వ వార్డుకు చెందిన పారిశుధ్య సిబ్బందికి జీవీఎంసీ విభాగం సమకూర్చిన దుస్తులను మంగళవారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, కార్యదర్శులు కనకరాజు, గంగునాయుడు, స్థానిక నాయకులు అమరపిని జోగినాయుడు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సత్కారం



గంగాధరరావును సత్కరిస్తున్న గ్రామస్థులు

పరవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న కొరుపోలు గంగాధరరావును బాపడుపాలెం మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ బొండా తాతారావు తదితరులు గంగాధరరావును దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. గంగాధరరావుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఆర్. సత్యవేణి, ఉపాధ్యాయుడు జి. బంగార్రాజు, వీఆర్వో శ్రీనివాసరావు, దాట్ల గణేష్‌రాజు, కొత్తపల్లి రత్నం, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గౌరీపరమేశ్వరులు, లక్ష్మీనారాయణల కల్యాణం

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గౌరీ పంచాయతన ఆలయంలోని కార్తీకమాసం ఏకాదశి సందర్భంగా మంగళవారం ఆలయ మండపంలో గౌరీ పరమేశ్వరులు, సత్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంపోలు గోపాలకృష్ణశర్మ, సూర్యనారాయణశాస్త్రి ఘనంగా నిర్వహించారు. మగ పెళ్లివారి తరపున కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణ, ఆళ్ల మహాలక్ష్మినాయుడు దంపతులు, ఆడ పెళ్లి వారి తరుపున మళ్ల అప్పలనాయుడు, మళ్ల సురేష్, మళ్ల బుజ్జి, మళ్ల మహేష్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శరగడం జగదీష్, పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు నాశనం

కొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అనకాపల్లి పట్టణ, రూరల్ పోలీసులు తెలిపారు. ఏఎంఏఎల్ కళాశాల, కూండ్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి నిర్వీర్యమైపోతున్నారని వాపోయారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్, కూండ్రం టీడీపీ సీనియర్ నాయకుడు నందారపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కాలువల సమస్యను పరిష్కరించండి

కొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కొత్తూరు దేవీ నగర్ కాలనీలో మురుగునీటి కాలువల సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కు స్థానికులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. 40 ఏళ్లుగా ఈ ప్రాంతంలో 80 కుటుంబాలు స్థిర నివాసం ఉంటున్నామని, ఇంటి పన్నులు సమయానికి చెల్లిస్తున్నామని, అయినా తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. పాలకవర్గాలు, అధికారులు మారినా తమ సమస్యలు మాత్రం ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. తక్షణమే కాలనీలో వాడుక నీరు సుగుమంగా ప్రవహించేందుకు కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే దొంగగెడ్డను ఆనుకొని 600 మీటర్ల వరకు మూడు వీధులు ఉన్నాయని వాటిలో గెడ్డకు అనుసంధానం చేస్తూ కాలువలు నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## వరి యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు

కొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని తగరంపూడి, వెంకుపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏడీఏ రామారావు, ఏవో రంగాచారి మాట్లాడారు. వ్యవసాయంలో సేంద్రియ ఉత్పత్తులు, వివిధ పంటల్లో ఏ విధంగా వాడాలనే అంశాలను వివరించారు. రబీ సాగుకు సంబంధించి మినుములు, పెసలన్నీ రైతు సేవా కేంద్రాల్లో ఉంచడం జరిగిందన్నారు. రాయితీపై రైతులకు వచ్చే ప్రతీ పథకాన్ని పొందాలన్నారు. ముందుగా వ్యవసాయ పంట పొలాలను క్షేత్ర పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు పుష్ప, జ్యోతిమోహన్, ఏపీసీఎంఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహంపై ఆశ కార్యకర్తలకు అవగాహన

కశింకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలకు మంగళవారం మధుమేహం, సాధారణ వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సులో డాక్టర్ కుసుమ మాట్లాడారు. ప్రతీ ఆశ కార్యకర్త ఆయుష్ వైద్య విధానంపై అవగాహన కలిగి ఉండాలని, దీని ద్వారానే ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించగలరని చెప్పారు. అనంతరం ఆయుష్ మిషన్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి యు.రమేశ్, ఎంపీహెచ్ఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రగతి పత్రాలు

కశింకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపర్తి ఉన్న పాఠశాలకు చెందిన విద్యార్థులకు మంగళవారం ప్రగతి పత్రాలను అందజేశారు. విద్యార్థి మేలుకో కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామున 5 నుంచి 7 గంటల వరకు రెండు రోజు పాటు పదో తరగతి విద్యార్థులకు ఇంటింటికీ వెళ్లి వారు చదువుతున్న అంశాలను తెలియజేశారు. వీటిలో తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది మార్చి నెల వరకు కొనసాగిస్తామని ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, ఏ.వి.ఎస్.మూర్తి, విజయ్ తదితరులు తెలిపారు.

## ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు కోసం ఈ నెల 16న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు ఆటో స్టాండ్‌ల వద్ద మంగళవారం కార్మికులతో సమావేశాలు, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఆటో అండ్ మోటార్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డ్రైవర్లను మోసం చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఆటో, మోటార్ కార్మికులకు ఇచ్చిన వాహనమిత్ర రూ.15 వేలు హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నూకరాజు, గొలగాని చిన్న, బాబి మహేష్, అప్పారావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



మైనర్లతో మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ హెచ్చరించారు. పట్టణంలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్‌లను అదుపులోకి తీసుకుని స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పిల్లలు వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బుచ్చెయ్యపేట 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్ రాము మృతి

చోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలం 'ఆంధ్ర జ్యోతి' రిపోర్టర్‌గా పనిచేస్తున్న సిరిగిరిశెట్టి రాము (58) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన రాము 'ఆంధ్రజ్యోతి' పునఃప్రారంభం నుంచి రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారు జామున వడ్డాదిలోని తన స్వగృహంలో కన్నుమూశారు. రాముకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాము కుటుంబాన్ని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీడీవో విజయలక్ష్మి, 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది, రిపోర్టర్లు, ఏపీడబ్ల్యూజే ప్రతినిధులు పరామర్శించి సంతాపం తెలిపారు.

రాము (ఫైల్ ఫొటో)

## పోలీస్ బదిలీల్లో రాజకీయ జోక్యం

... 5వ పేజీ తరువాయి

ఒక్క ఎస్ఐ మాత్రమే ఉండాల్సి ఉండగా.. ఇద్దరు ఎస్ఐలు అటాచ్‌మెంట్ ఉత్తర్వులు తెచ్చుకోవడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తొలుత ఆర్డర్ పొందిన ఎస్ఐ కొనసాగుతారా లేక ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ఎస్ఐను విధుల్లో కొనసాగిస్తారా అన్నది సందిగ్ధంగా మారింది. ఒక స్టేషన్‌లో ఇద్దరు ఎస్ఐలు విధులు నిర్వహిస్తుండడంతో ఎవరి మాట వినాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని దిగువ స్థాయి సిబ్బంది వాపోతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు ఎస్ఐల అటాచ్‌మెంట్ నియామకాల వివాదానికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం పోలీసు వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

# మాస్టారి ఇల్లే మ్యూజియం



రాగి, ఇత్తడితో చేసిన పలురకాల వస్తువులు, సామగ్రి

**ఉపాధ్యాయుని ఇంట పురాతన కళాఖండాలు**

**ఇత్తడి, రాగి, తగరంతో చేసిన అరుదైన వంటపాత్రలు, పలు రకాల వస్తువులు**

- గ్రామఫోన్, పాటల రికార్డులు, టెలిఫోన్లు, కిరోసిన్ లాంతర్లు
- మ్యూజియం ఏర్పాటే లక్ష్యమంటున్న మాస్టారు
- తాజాగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక
- సీఎం చంద్రబాబు చేతులమీదుగా పురస్కారం అందుకున్న గంగాధరరావు



గంగాధరరావు

**వృత్తిరీత్యా ఆయనొక ప్రభుత్వ ఉపాధ్యాయుడు. పురాతన వస్తువుల సేకరణ ఆయన ప్రవృత్తి. పేరు కొరుప్రోలు గంగాధరరావు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా పరవాడ మండలం భరణికం పంచాయతీ పరిధిలోని బాపడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. మాస్టారి ఇల్లు కళాఖండాల భాండాగారం. ఇప్పటి తరానికి తెలియని, చూడని ఎన్నో వస్తువులు ఆయన నివాసంలో కనిపిస్తాయి. రాజుల కాలం నుంచి ఆంగ్లేయుల వరకు వాడిన వివిధ రకాల పనిముట్లు, సామగ్రి, వారి ఆహారపు అలవాట్లను భవిష్యత్తు తరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో ఎన్నో రకాల వస్తువులను సేకరించారు. గంగాధరరావు ఈ ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై ఈ నెల 11వ తేదీన విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.**

**- పరవాడ-ఆంధ్రజ్యోతి**

పూర్వకాలంలో వంటపాత్రలు, ఇతర గృహోపకరణాలను చేతితో తయారుచేసేవారు. రాగి, ఇత్తడి, తగరం వంటి లోహాలతోపాటు మట్టితో కూడా రూపొందించేవారు. కాలక్రమేణా పింగాణి, స్టెయిన్‌లెస్ స్టీల్, జర్మన్ సిల్వర్ (అల్యూమినియం), ఫైబర్, ప్లాస్టిక్‌తో తయారుచేసిన వస్తువుల వాడకం పెరిగింది. దీంతో రాగి, ఇత్తడి, తగరంతో చేసిన గృహోప కరణాలు కనుమరుగయ్యాయి. అయితే గంగాధర్ మాస్టారు...ఇటువంటి పురాతన సామగ్రిని సేకరించడం హాబీగా మార్చుకున్నారు. కంచు గిన్నెలు, గ్లాసులు, చెంబులు, గోకరణాలతోపాటు గ్రామ్‌ఫోన్లు, వాటి రికార్డులు, కిరోసిన్ లాంతర్లు, పాత రేడియోలు, కర్ర గరిటెలు, తదితర వాటిని సేకరించి భద్రపరుస్తున్నారు. ప్రస్తుతం ఘన వస్తువులను గ్రాములు/కిలోల్లో, ద్రవ వస్తువులను లీటర్లలో కొలుస్తున్న విషయం తెలిసిందే. కానీ ఐదారు దశాబ్దాల క్రితం వరకు ఘన వస్తువులను తూకం వేయడానికి ఇత్తడితో తయారుచేసిన కొలమానం పాత్రలను వినియోగించేవారు. వీటిని సేరు, వీశ, అర్ధ మణుగు, మణుగు అనేవారు. ధాన్యం వంటి వాటిని కొలవడానికి వినియోగించే పరికరాలను గిద్ద, సోల, మానిక వంటి పేర్లతో పిలిచేవారు. ఇటువంటి ఎన్నో అరుదైన వస్తువులను ఆయన సేకరించి భద్రపరిచారు.

మాస్టారు సేకరించిన వస్తువుల్లో భోజనం చేసే కంచు గిన్నె సుమారు ఐదు కిలోల బరువు వుండడం విశేషం. అప్పట్లో అలంకరణ, పిల్లల ఆట వస్తువులు కలప, ఇత్తడితో తయారుచేసేవారు. 1932 నుంచి నాలుగు దశాబ్దాల క్రితం వరకు సినిమా పాటలు గ్రామఫోన్ రికార్డుల రూపంలో ఉండేవి. 1952లో వచ్చిన 'శ్రీరామ పాదుకలు' సినిమా పాటల రికార్డు మొదలుకొని 78, 45, 33.5 ఆర్‌పీఎం రికార్డులు (ఎల్‌పీలు) సుమారు రెండు వేల వరకు ఉన్నాయి. ప్రముఖ గాయకులు ఘంటశాల, సుశీల, బాలసుబ్రహ్మణ్యం, జేసుదాసు, మహ్మద్ రఫీ, ఆనంద్, జానకి, జమునా రాణి పాడిన పాటల క్యాసెట్‌ను సేకరించారు. గ్రామాలకు కరెంటు సదుపాయం లేని రోజుల్లో కిరోసిన్ లాంతర్లను వినియోగించేవారు. గంగాధరరావు మాస్టారు ఇటువంటి పలు రకాల లాంతర్లను సేకరించి భద్రపరిచారు.



దశాబ్దాల నాటి గ్రామఫోన్, టీవీ, రేడియో, టెలిఫోన్

మనదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1959లో అమెరికా వెళ్లినప్పుడు అక్కడ చేసిన ప్రసంగం, పేపరు రికార్డులు, వెయ్యికి పైగా టేపు క్యాసెట్లు ఉన్నాయి. పెద్ద పెద్ద రేడియోలు, టెలిఫోన్లు, టైప్ మిషన్లు, కత్తులు, కొరడాలను సేకరించి భద్రపరుస్తున్నారు. వెయ్యి సంవత్సరాల క్రితం నాటి తాళపత్రాలు, బ్రిటీష్‌కాలం నాటి ఉత్తరాలు, 600 ఏళ్ల నాటి జమిందారి రాజముద్ర, వందేళ్ల నాటి రంగం పెట్టె, చేతితో తయారుచేసిన రాజుల కాలం నాటి నెమళ్లు, తూనికల పరికరాలను సేకరించి నేటి తరం పిల్లలకు తెలిసేలా అప్పుడప్పుడు ప్రదర్శిస్తున్నారు.



ఇత్తడితో చేసిన వంటపాత్రలు, పూర్వం కాలం నాటి పాత్రలు

**పురాతన వస్తువులతో మ్యూజియం**

మన పెద్దలు, పూర్వీకులు ఉపయోగించిన పలు రకాల వస్తువులను సేకరించాలన్నది నా లక్ష్యం. నాడు వాడిన వస్తువులకు ఓ ప్రత్యేకత, ప్రయోజనం ఉండేవి. పర్యావరణ హితంగా తయారుచేసేవారు. ఇప్పుడన్నీ ప్లాస్టిక్, కెమికల్స్, హానికర పదార్థాలతో తయారవుతున్నాయి. ఆ తేడాను తెలియజేయాలన్న ఉద్దేశంతో పురాతన వస్తువుల సేకరణ ప్రారంభించాను. చాలా ఏళ్ల క్రితం వినియోగించిన కొన్ని రకాల వస్తులను సేకరించడానికి డబ్బులు సైతం వెచ్చిస్తున్నారు. సేకరించిన వస్తువులను భద్రపరచడానికి మా ఇంట్లో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించాను. ఇంకా చాలా రకాల వస్తువులను సేకరించాలని అనుకుంటున్నాను. పురాతన వస్తువులతో త్వరలో ఒక మూజియం ఏర్పాటు చేస్తాను.

**- కొరుపోలు గంగాధరరావు, ఉపాధ్యాయుడు**







## గంజాయి, సారా కట్టడికి పటిష్ట చర్యలు

- డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- 'సబ్బవరం' పోలీసులకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం

సబ్బవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా, నాటుసారా తయారీ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను, పరిసరాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వివిధ సమస్యలపై పోలీసు స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, మహిళలపట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయడానికి ఆకస్మిక తనిఖీలు, సోదాలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్ పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్స్, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకొని వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎస్పీ వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, స్థానిక సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐలు సింహాచలం, దివ్య వున్నారు.



పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

## అగ్రి ఇంజినీరింగ్ శాస్త్రవేత్తల బృందానికి అవార్డు

అనకాపల్లి అగ్రికల్చర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వ్యవసాయ ఇంజనీరింగ్ శాస్త్రవేత్తలు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, డాక్టర్ పి.శ్రీదేవి, డాక్టర్ కె.కిరణ్మయికి ఇండియన్ సొసైటీ ఫర్ అగ్రికల్చర్ ఇంజనీర్స్ టీం అవార్డు లభించింది. బెల్లంపొడి తయారీకి ఉపయోగించే యంత్రాలు, చెరకులో విలువ ఆధారిత ఉత్పత్తులపై పరిశోధనలకుగాను వీరు జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని పర్భణిలో మంగళవారం జరిగిన వ్యవసాయ ఇంజినీరింగ్ జాతీయ సదస్సులో భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ పరోడా, వ్యవసాయ ఇంజనీరింగ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.ఎన్.ఝూల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.




అవార్డు స్వీకరిస్తున్న అనకాపల్లి శాస్త్రవేత్తలు

### జర్మన్ భాషపై శిక్షణ, ఉపాధి

అనకాపల్లి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓంకాప్ ద్వారా బీఎస్సీ, జీఎన్ఎం చదువుతున్న విద్యార్థులకు జర్మన్ భాష నేర్పించి జర్మనీ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులు జర్మనీ దేశంలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఆరు నెలలపాటు రోజుకి ఏడు గంటల చొప్పున గుంటూరులో రెసిడెన్స్ స్కాలర్ విధానంలో జర్మన్ భాషలో ఏ1, ఏ2, బీ1, బీ2 స్థాయిలో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు రూ.75 వేలు లేదా వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులు గైర్హాజరు కాకుండా ఉండడానికి, కోర్సు నుంచి తప్పుకోవడాన్ని నివారించడానికి నగదు/ సర్టిఫికెట్లను డిపాజిట్ చేయించుకుంటున్నట్టు చెప్పారు. శిక్షణను విజయవంతంగా ముగించుకున్న అభ్యర్థులు జర్మనీ వీసా పొందిన తర్వాత డిపాజిట్ సొమ్ము లేదా సర్టిఫికెట్లను తిరిగి ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉందని, డిసెంబరు ఒకటవ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని, మరింత సమాచారం కోసం 99888 53335 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

## వారధి కలేనా?

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. అప్పటి నుంచి పందూరు వంతెనకు గ్రహణం పట్టుకుంది. ఐదేళ్ల కాలంలో ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదు.

### నదిలో కొట్టుకుపోయి ముగ్గురి మృతి

వరహా నదిలో వరద ప్రవాహం అధికంగా వుంటే ఈ మూడు గ్రామాల ప్రజలు అత్యవసరమైతే గొట్టివాడ పాతరోడ్డు వంతెన మీదుగా చుట్టూ తిరిగి మండల కేంద్రానికి చేరుకోవాల్సి వస్తున్నది. అయితే అత్యవసర పనుల కోసం నదిని దాటుతూ గత తొమ్మిదేళ్ల కాలంలో ముగ్గురు వ్యక్తులు నీటిలో కొట్టుకుపోయి మృతిచెందారు. కాగా పందూరు వద్ద వరహా నదిపై వంతెన నిర్మాణం గురించి పంచాయతీరాజ్ (ప్రాజెక్టు) ఏఈ సత్యనారాయణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. సవరించిన అంచనాల మేరకు ప్రభుత్వం రూ.5.57 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. పిల్లర్లపై శ్లాబ్, రిటైనింగ్ వాల్స్, అప్రోచ్ రోడ్లు, తదితర పనులు చేయాల్సి వుందని, ఉన్నతాధికారులు త్వరలో టెండర్లు పిలుస్తారని ఆయన తెలిపారు.

## వెలుగులో కుంభకోణం

... 5వ పేజీ తరువాయి

పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన కొందరు సభ్యులు వీవోఏను గట్టిగా నిలదీయడంతో ఈ వ్యవహారం బయటపడినట్టు చెబుతున్నారు. రుణాల సొమ్ముతోపాటు రుణ వాయిదాల చెల్లింపు సొమ్ము వీవోఏ స్వాహా చేసిన విషయం వెలుగులోకి రావడంతో సింహాద్రిపురం పంచాయతీ పరిధిలోని డ్వాక్రా మహిళలు మంగళవారం గోవాడలోని స్టేట్ బ్యాంకుకు వెళ్లారు. రుణాలు, చెల్లింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాము తీసుకున్న రుణాలకు, తిరిగి చెల్లిస్తున్న బకాయిలకు మధ్య చాలా వ్యత్యాసం ఉండడంతో తమను మోసగించావంటూ వీవోఏను పట్టుకుని నిలదీశారు. అంతటితో ఆగకుండా వెలుగు కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి చేసిన మోసాన్ని వివరించారు. దీంతో వెలుగు అధికారులు గోవాడ స్టేట్ బ్యాంకుకు వెళ్లి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. మొత్తం మీద సింహాద్రిపురం పంచాయతీలో వీవోఏ 40 లక్షల రూపాయలకుపైగానే నిధులు స్వాహా చేసినట్టు తెలిసింది. ఈ విషయాన్ని వెలుగు ఏపీఎం డీవీ తిలక్ దృష్టికి తీసుకెళ్లగా, సింహాద్రిపురం వీవోఏ అక్రమాలకు పాల్పడినట్టు డ్వాక్రా సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై గోవాడ స్టేట్ బ్యాంకుకు తమ సిబ్బందిని పంపించి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు.

### బ్యాంకు అధికారుల పాత్రపై అనుమానాలు

డ్వాక్రా సంఘాల రుణాలకు సంబంధించి వెలుగు వీవోఏ నిధుల స్వాహా వ్యవహారంపై గోవాడ స్టేట్ బ్యాంకు అధికారుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సభ్యుల సంతకాలు లేకుండా వారి ఖాతాల్లో నుంచి డబ్బులు ఎలా డ్రా చేశారన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఈ వ్యవహారంలో వీవోఏకు సహకరించిన బ్యాంకు ఉద్యోగులపైనా విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

**క్రైం... crime news**

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

కొయ్యూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి మండలం కాకరపాడుకు సమీపంలోని దాకోడు గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దాకోడుకు చెందిన పొడుగు సత్యనారాయణ(30) మంగళవారం ఉదయం గ్రామంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు అతనిని రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలుశిక్ష

చోడవరం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ఇద్దరికి పదేళ్ల కారాగార శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎ.రత్నకుమార్ తీర్పు ఇచ్చారు. రోలుగుంట మండలం రత్నంపేట గ్రామానికి చెందిన పడాల నాగేశ్వరరావు, గుర్రం నగేశ్‌లు 2014 డిసెంబరు 2న గంజాయిని ఆటోలో తరలిస్తూ బుచ్చెయ్యపేట మండలం రాజాం జంక్షన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి 36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అప్పటి ఎస్ఐ కె.లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. గంజాయి తరలిస్తున్నట్టు నేరం రుజువుకావడంతో జడ్జి రత్నకుమార్ వారికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధించారు. లక్ష రూపాయల జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నర సంవత్సరాల జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకటరావు వాదించారు.

## విశాఖలో బంగారు వర్ణంలో నాగుపాము

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని యారాడ డాల్ఫిన్స్ నోస్ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం బంగారం రంగు నాగుపాము కనిపించింది. నేవీ అధికారి ఒకరు పార్కింగ్ షెడ్డు నుంచి తన కారును బయటకు తీసేందుకు ఐదు గంటల సమయంలో వెళ్లగా చీకటిలో మెరుస్తూ ఏదో కదులుతున్నట్టు కనిపించింది. దగ్గరకు వెళ్లి చూసేందుకు యత్నించగా బుస కొడుతూ నాగుపాము పడగ ఎత్తింది. వెంటనే ఆయన వెనక్కి వచ్చేశారు. స్థానికులు స్నేక్ క్యాచర్ నాగరాజుకు ఫోన్ చేయగా, ఆయన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా దానిని పట్టుకున్నారు. దీనిపై నేవీ అధికారి మాట్లాడుతూ, గతంలో తాను అటవీ ప్రాంతంలో పనిచేశానని, ఈ నాగుపాము బంగారం రంగులో మెరుస్తున్నదని, అరుదైన జాతికి చెందినదని, అటవీ అధికారులకు అప్పగించాలని నాగరాజుకు సూచించారు. స్నేక్ క్యాచర్ నాగరాజు మాట్లాడుతూ, తాను ఇప్పటివరకూ సుమారుగా పది వేల పాములు పట్టానని, ఎప్పుడూ ఇలా బంగారం రంగులో ఉన్న నాగుపామును చూడలేదని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అది పడగ విప్పినప్పుడు మెడ, పడగ మొత్తం బంగారం రంగులో మెరిసిపోతున్నదని, పడగ కింది భాగం నామం కూడా మూసుకుపోయేలా బంగారం రంగు కప్పేసిందని వివరించారు.



నాగుపాము

## విప్‌లుగా ఇద్దరు

... 5వ పేజీ తరువాయి

ఆఫీసు, నిర్వహణకు సిబ్బందిని అందిస్తుంది. సభలో తీర్మానాలు ప్రవేశపెట్టడానికి, చర్చ లేవదీయడానికి, సవరణలు ప్రతిపాదించడానికి అవకాశం లభిస్తుంది. ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారం, పత్రాలు చూడడానికి అధికారం ఉంటుంది. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించినప్పుడు తగిన ప్రాధాన్యం లభిస్తుంది. కీలక సమావేశాలు నిర్వహించినప్పుడు ఆహ్వానం ఉంటుంది.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 102.00 |
| లైవ్ ధర | 122.00 |
| విత్ స్కిన్ | 214.00 |
| స్కిన్ లెస్ | 224.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 525 |
| విజయనగరం | 529 |
| శ్రీకాకుళం | 529 |